
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 24 ఆగస్టు 2025



బీఎస్ఎన్ఎల్ ఆఫర్‌ను వినియోగించుకోండి

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆజాదీ కా ఆఫర్ పథకంలో భాగంగా రూ.1కే ఉచిత సిమ్, 2జీబీ డేటాతో 30 రోజుల ఉచిత కాల్స్‌ను బీఎస్ఎన్ఎల్ వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ సీ. అమరేంద్రరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ఈనెలాఖరు వరకు అమలు ఉంటుందని తెలిపారు. ఈ పథకం కింద ఆంధ్రా సర్కిల్‌లో ఇప్పటివరకు 96వేల మంది వినియోగదారులు లబ్ధిపొందారని ఆయన వివరించారు. జిల్లాలో 4,300 మంది ప్రయోజనం పొందారని తెలిపారు. జాతీయస్థాయిలో రాష్ట్రం 2వస్థానం సాధించిందని ఆయన పేర్కొన్నారు.



మెగా డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల కావడంతో అభ్యర్థుల్లో ఆనందాన్ని, ఉత్సాహాన్ని నింపింది. ఏళ్ల తరబడి ఉపాధ్యాయ కొలువే లక్ష్యంగా సన్నద్ధమవుతున్న వారికి మెరిట్ జాబితా విడుదల ఊరట నిచ్చింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్త మవుతున్నాయి. డీఈడీ, బీఈడీ పూర్తి చేసి ఏళ్లతరబడి నిరీక్షిస్తున్న నిరుద్యోగులు సంబరాల్లో మునిగిపోయారు. పలు విభాగాల్లో అభ్యర్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడంతో సోమవారం నుంచి జరగనున్న సర్టిఫికెట్ల పరిశీలనకు సన్నద్ధమవుతున్నారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

మెగా సంబరం

• డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల • జిల్లావాసులకు ఉత్తమ ఫలితాలు • నిరుద్యోగుల్లో వెల్లివిరిసిన ఆనందం

రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఈసారి డీఎస్సీలో వయోపరిమితి పెంచడంతోపాటు క్రీడా కోటాలోనూ వెయిటేజీ పెంచారు. ఇవన్నీ నిరుద్యోగులకు కలిసివచ్చే అంశాలు కాగా వయోపరిమితి పెంపుతో ఎంతోమంది అవకాశం కూడా లభించనుంది. జిల్లావ్యాప్తంగా అన్ని మేనేజ్‌మెంట్లలో 673 పోస్టులు భర్తీ చేయనుండటంపై అభ్యర్థులంతా రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమవుతున్నారు. జిల్లాలో మెగా డీఎస్సీ-2025 ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌లను జూన్ 6 నుంచి 30వతేదీ వరకు ఉమ్మడిజిల్లాలోని 8 కేంద్రాల్లో నిర్వహించారు. మొత్తం 31,221 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్, ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో 673 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో లాంగ్వేజ్-1 39, హిందీ 18, ఇంగ్లీష్ 84, మ్యాథ్స్ 63, ఫిజికల్ సైన్స్ 76, బయాలజీ 63, సోషల్ 103, ఫిజికల్ ఎడ్యుకేషన్ 107, ఎస్‌జీటీ 115, ట్రైబుల్ వెల్ఫేర్ విభాగంలో హిందీ 1, ఇంగ్లీష్ 1, మ్యాథ్స్ 1, ఎస్‌జీటీ 2 కలిపి 5 పోస్టులు, రెండు విభాగాల్లో 673 పోస్టులు ఉన్నట్లు తెలిపారు.

• రేపటి నుంచి పత్రాల పరిశీలన

అర్హుల జాబితాలో ఉన్న అభ్యర్థుల పత్రాలను సోమవారం నుంచి పరిశీలించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. నగరంలోని వైఎంసీఏ మైదానంలోని వీఆర్ పీజీ కళాశాలలో జరిగే పరిశీలనకు ఉపాధ్యాయులను నియమిస్తున్నట్లు తెలిపారు. వీరితోపాటు బీసీ, సాంఘీక, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు కూడా అందుబాటులో ఉంటారన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి వీటిలో స్వల్ప మార్పులు జరిగే అవకాశం ఉందని, లేని పక్షంలో 25నే పరిశీలన ఉంటుందని స్పష్టం చేశారు. మెరిట్ లిస్ట్ జాబితాను డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌తోపాటు జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. వివిధ కేటగిరీలకు సంబంధించిన పోస్టుల నియామక ప్రక్రియలో భాగంగా జోన్ ఆఫ్ కన్సిడరేషన్‌లోకి వచ్చిన అభ్యర్థులకు తమ వ్యక్తిగత లాగిన్ ద్వారా కాల్‌లెటర్ అందిస్తామన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్ల జెరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వ్యక్తిగతంగా హాజరు కావాలన్నారు. అలాగే వెరిఫికేషన్‌కు ముందే సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పరిశీలనకు అభ్యర్థి హాజరు కాకపోయినా, సరైన సర్టిఫికెట్లు సమర్పించకపోయినా తగిన విద్యార్హతలు లేకపోయినా మెరిట్ లిస్ట్‌లోని తరువాత వారికి అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు.

• అత్యధిక స్కోర్ వీరికే..

డీఎస్సీ మెరిట్ జాబితాలో పలువిభాగాల్లో అభ్యర్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఎస్ఏ (ఇంగ్లీష్)లో జి.మోహన వెంకట సతీష్ 88.13 స్కోర్, ఎస్ఏ (హిందీ)లో సయ్యద్ షబ్‌నాజ్ 84.65, ఎస్ఏ(తెలుగు)లో ఎం.శ్రీకాంత్ 90.15, ఎస్ఏ(ఉర్దూ)లో షేక్. గయాజుద్దీన్ 86.33, ఎస్ఏ(బయలాజికల్ సైన్స్)లో సీహెచ్.వెంకటరెడ్డి 85.36, ఎస్ఏ (మ్యాథ్స్)లో డి.నాగసాయి శరత్‌ఫణీంద్ర 84.30, ఎస్ఏ(పీఈ)లో ఆర్.సాయికోటి 93, ఎస్ఏ(ఫిజికల్ సైన్స్)లో ఎల్.వినయ్‌కుమార్ 87.87, ఎస్ఏ (సోషల్)లో ఎం.బాబు 85.02 స్కోర్లతో అగ్రస్థానంలో నిలిచారు. అలాగే ఎస్‌జీటీ విభాగంలో షేక్.నాయబ్ రసూల్ 94.51, ఎస్‌జీటీ (ఉర్దూ)లో సయ్యద్ రిజ్వాన్ అలీషర్ 57.77స్కోర్‌లతో మొదటిస్థానం సాధించారు.

దళారుల మాట నమ్మొద్దు

ఉపాధ్యాయ ఉద్యోగం ఇప్పిస్తామని దళారులు చెప్పే మాటలు నమ్మవద్దని డీఈఓ తెలిపారు. కొంతమంది సోషల్ మీడియా వేదికగా, అసత్య వదంతులు వ్యాప్తి చేస్తూ అభ్యర్థులను ఆందోళనకు చేస్తున్నారని చెప్పారు. ఇలాంటివి నమ్మి మోసపోవద్దని, వదంతులు వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థులు డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్న ప్రకటనలు, నోటిఫికేషన్‌లు, ఫలితాలను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.

పట్టుబట్టి.. కొలువు కొట్టి...



అన్నదమ్ములు నస్రుల్లా, సిగ్బతుల్లా

ఉదయగిరి : మెగా డీఎస్సీ మెరిట్ జాబితాలో ఉదయగిరి ప్రాంతానికి చెందిన పలువురు తమ సత్తా చాటి ఉద్యోగాలు సాధించారు. సున్నంవారిచింతల గ్రామానికి చెందిన పులిమి శ్రీతేజ డీఎస్సీలో మూడు ఉద్యోగాలు సాధించింది. స్కూల్ అసిస్టెంట్ సోషల్ సబ్జెక్టులో జిల్లాస్థాయిలో 82.11 మార్కులు సాధించి 4వ ర్యాంకు, టీజీటీ జోనల్-3 స్థాయిలో 73.20 మార్కులు సాధించి 17వ ర్యాంకు, ఎస్‌జీటీ చిత్తూరు జిల్లా నాన్‌లోకల్ కింద 86.92 మార్కులతో 33వ ర్యాంకు సాధించింది. అలాగే ఉదయగిరిలోని దిలావర్‌భాయ్‌వీధికి చెందిన అన్నదమ్ములైన షేక్ నస్రుల్లా ఎస్ఏ ఇంగ్లీష్ సబ్జెక్టులో 57వ ర్యాంకు, షేక్ సిగ్బతుల్లా జోన్-3 పీఈటీ బీసీ-ఈ విభాగంలో 1వ, జనరల్ కేటగిరీలో 179వ ర్యాంకులు సాధించి కొలువు కొట్టారు. కాగా వీరిలో నస్రుల్లా ప్రస్తుతం దుత్తలూరు మండలం వెంకటంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్టీటీగా పని చేస్తున్నారు.



మూడు ఉద్యోగాలు సాధించిన పులిమి శ్రీతేజ

ఫలించిన 'స్వప్న'ం



పొదలకూరు : ఒకరు ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనం అవుతున్న నేపథ్యంలో ఆమె హిందీలో మూడు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నిరంతర శ్రమ, పట్టుదలతో తన స్వప్నాన్ని సాకారం చేసుకున్నారు. పొదలకూరు మండలం చెర్లోపల్లికి చెందిన తిరుమూరు స్వప్న విజయగాథ ఇది. 2018 డీఎస్సీలో కేవలం ఒక్క మార్కుతో ఉద్యోగం చేజారిపోయింది. అయినా ఆమె నిరాశపడలేదు. పట్టుదలతో చదివి 2025 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ హిందీలో జిల్లాస్థాయిలో 3వ ర్యాంకు, పీజీటీలో 2వ ర్యాంకు, టీజీటీలో 5వ ర్యాంకు సాధించారు. మొత్తం మూడు కేటగిరీల్లో ఉద్యోగాలు కైవశం చేసుకున్నారు.తన శ్రమతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం, సైకాలజీ టీచర్ వేణు సలహాలు, సూచనలు తాను 3 ఉద్యోగాలు సాధించేందుకు దోహదపడ్డాయని స్వప్న తెలిపారు.

ఆత్మకూరులో..





అన్నదమ్ములు షేక్ అజహరుల్లా, అతహరుల్లా

ఆత్మకూరు : పట్టణంలోని ఇద్దరు సోదరులు ఎస్‌జీటీలో 5, 17వ ర్యాంకులు సాధించి ఉపాధ్యాయ పోస్టులకు ఎంపకయ్యారు ఉలవదిబ్బకు చెందిన షేక్ అజహరుల్లా, అతహరుల్లా ఇద్దరు సోదరులు. తండ్రి షేక్ జిలానీ. ప్రభుత్వ ఉపాధ్యాయుడు. కష్టపడి చదివి తండ్రిలాగే ఉపాధ్యాయులు కావాలని కలలు కన్నారు. ఆ మేరకు కష్టపడి డిగ్రీ, బీఈడీ చేశారు. శిక్షణ పొంది డీఎస్సీ రాశారు. అజహరుల్లా 90.63519, అతహరుల్లా 89.07814 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో 5, 17వ ర్యాంకులు సాధించారు.

కానిస్టేబుళ్ల ధ్రువీకరణ పత్రాల పరిశీలన



ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(క్రైం) ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థులకు శనివారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిర్వహించారు. జిల్లాలో మెత్తం 243 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాల్సి ఉండగా, 235 మంది హాజరయ్యారు. ఎనిమిదిమంది హాజరు కాలేదు. సివిల్‌లో 142 మందికి 137 మంది, ఏపీఎస్పీలో 101 మందికి 98 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థుల విద్యార్హతలు, క్రీడా సర్టిఫికెట్ల కేటగిరీకి సంబంధించిన ధ్రువపత్రాలను క్షుణ్ణంగా అధికారులు పరిశీలించారు. ఎస్పీ జీ. కృష్ణకాంత్ మాట్లాడుతూ కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులు భవిష్యత్తులో క్రమశిక్షణ, నిబద్ధతతో ప్రజాసేవ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో చంద్రమౌళి, సూపరింటెండెంట్ సురేష్, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

7.6 లక్షల మంది అతివలకు ఉచిత ప్రయాణం

• తొలివారంలో రూ.2.9 కోట్ల లబ్ధి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) (ఆంధ్రజ్యోతి) : స్త్రీశక్తి పథకం ప్రారంభమైన తొలివారంలో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా 7,64,311 మంది మహిళలు ప్రయాణించారని జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షమీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీన పథకం ప్రారంభమవగా 22వ తేదీ వరకు పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ వంటి మూడు రకాల బస్సులలో 14,88,537 మంది ప్రయాణించారు. వీరిలో 7.6 లక్షల మంది మహిళలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ వారం రోజుల్లో మహిళలకు రూ.2,91,98,935 మేర ఈ పథకం ద్వారా లబ్ధి కలిగిందని పేర్కొన్నారు. బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని తెలిపారు.

కొత్త కార్డులు వచ్చేశాయ్!

• జిల్లాకు చేరిన 7,10,990 రేషన్‌కార్డులు
• రేపటి నుంచి లబ్ధిదారులకు పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఎంతో కాలంగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కొత్త కార్డుల కోసం కొందరు.. ఉన్న కార్డులలో మార్పు, చేర్పుల ఇంకొందరు చాన్నాళ్లుగా ఎదురు చూస్తున్నారు. వైసీపీ పాలనలో కార్డులు కోసం దరఖాస్తు చేసినా ఫలితం లేకుండా పోయింది. కనీసం కార్డులలో మార్పు, చేర్పులు కూడా జరగలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అధికారిక ముద్రతో కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డు లను ఇస్తామని ప్రకటించింది. అన్న మాట ప్రకారం ఈ నెల 25 నుంచి ఆ కార్డులను పంపిణీ చేయనుంది. ఆధునిక సాంకేతతో రూపుదిద్దుకున్న ఈ కార్డులలో బయోమెట్రిక్ డేటా, క్యూ ఆర్ కోడ్ వంటి ప్రత్యేకలు ఉన్నాయి. లబ్ధిదారులు ఎక్కడనుంచైనా సులభంగా రేషన్ సరుకులు తీసుకునే అవకాశం ఉంది. ఏటీఎం కార్డు సైజ్‌లో క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్‌కార్డులు ప్రభుత్వం ఇవ్వనుండటంతో ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

• 7,10,990 కార్డులు

జిల్లాకు 7,10,990 స్మార్ట్ రేషన్‌కార్డులు రాగా, వాటిని తహసీల్దారు కార్యాలయాలకు పంపారు. సచివాయానికి చెందిన ఓ ఉద్యోగి సంబంధిత ప్రాంతంలోని డీలర్ ద్వారా లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు అందచేస్తారు. ఈ నెల 31వ తేదీ వరకు ప్రతి కార్డుదారు ఇంటికి వెళ్లి కార్డులను ఇస్తారు. సెప్టెంబరు 1న రేషన్ పంపిణీ మొదలవుతుంది. ఈపాస్ మిషన్ ద్వారా కార్డుదారు వేలిముద్ర తీసుకుని ఆన్‌లైన్ పద్ధతిలో స్మార్ట్ కార్డులు అందచేస్తారు. కాగా, మే 7వ తేదీ నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం, కార్డులలో మార్పులు, చేర్పులు, సవరణల కోసం దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఆ తర్వాత అధికారుల పరిశీలన, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 25న స్మార్ట్ రేషన్‌కార్డులు అందచేస్తామని ప్రకటించిన తర్వాత కూడా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. కాగా, ఇప్పటి దాకా వరుసగా ఆర్నెల్లపాటు రేషన్ తీసుకోని వారికి కొత్తకార్డులు ఇవ్వరు. తమకు కార్డులు రాలేదని అధికారులకు తెలిపితే వారి విషయం పరిశీలించి కార్డులు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటారు.



కొత్త స్మార్ట్ రేషన్ కార్డు ఇదే..

రేపటి నుంచి పంపిణీకి సిద్ధం

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ముద్రించిన స్మార్ట్ రేషన్ కార్డులను ఈనెల 25 నుంచి జిల్లావ్యాప్తంగా పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. రేషన్ డీలర్, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు ఈ కార్డులను పంపిణీ చేస్తారు.

- ఎన్.విజయకుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి




రేషన్‌కార్డుల కోసం దరఖాస్తుల వివరాలు

వచ్చిన దరఖాస్తులు	71,808
కార్డుల్లో అడ్రస్‌ల మార్పు	1,986
వివరాల మార్పు	354
ఆధార్ సీడింగ్ సవరణ	1,318
చౌకధరల దుకాణాల రెన్యువల్	21
పేర్లు చేర్చడానికి	49,140
పేర్లు తొలగించడానికి	1,846
కొత్తకార్డుల కోసం	9,771
కార్డుల విభజన కోసం	7,334
ప్రభుత్వానికి సరెండర్ చేసినవి	38

అంతా రౌడీలేనయ్యా!

ఎందెందు వెతికినా



నెల్లూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రత్యేకించి నెల్లూరులో శాంతిభద్రతల పరిస్థితి రౌడీషీటర్ల దయాదాక్షిణ్యాల మీద ఆధారిపడి ఉంది. రౌడీమూకలు దయతలిస్తే పరిస్థితులు ప్రశాంతంగా ఉంటాయి. లేదంటే దాడులు, హత్యలు కొనసాగుతాయి. ప్రశాంతతకు మారుపేరు అయిన జిల్లాలో గడిచిన ఆరేళ్లుగా ఇదే పరిస్థితి. వైసీపీ హయాంలో ప్రజాప్రతినిధుల పక్కన రౌడీలే.., పోలీస్ స్టేషన్లలో పంచాయితీలు నడిపేది వారే, రోడ్డుకిరువైపులా కటౌట్లలోనూ వారి ముఖాలే, సామాన్యులకు తరచూ ఎదురయ్యే బెదిరింపుల్లోనూ వారే, హత్యల వెనుక వారే, గంజాయి విక్రయాల్లోనూ వారే చక్రం తిప్పారు. రౌడీలు పక్కన పెట్టుకొని తిరగడం ఫ్యాషన్‌గా భావించిన కొంతమంది నాయకుల పుణ్యమా అని ప్రశాంతమైన నెల్లూరు జిల్లాలో రౌడీయిజం మూడు కత్తులు.. ఆరు పోట్లుగా వర్ధిల్లింది. జీవిత ఖైదు అనుభవిస్తున్న వ్యక్తి జైలు లోపలి నుంచే నేర సామ్రాజ్యాన్ని నడిపించే స్థాయికి ఎదిగాడంటే, ఒక సాధారణ మహిళ రౌడీ గ్యాంగ్‌స్టర్‌గా సెటిల్‌మెంట్లు చేసే స్థాయికి చెలరేగిందంటే ఇందులో రాజకీయ నాయకులు, పోలీసు అధికారుల పాపం సమాన భాగాల్లో ఉందనే వాదన బలంగా వినిపిస్తోంది. బాధాకరం ఏమిటంటే హైదరాబాద్ పాతబస్తీలో అరాచకశక్తులను ఉక్కుపాదంతో అణిచేసిన చరిత్ర కలిగిన తెలుగుదేశం అధికారంలోకి వచ్చినా శాంతిభద్రతల విషయంలో ఎంతటి వారినైనా సరే ఉపేక్షించని నైజం కలిగిన చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం నడుస్తున్నా జిల్లాలో పరిస్థితి మెరుగు పడకపోవడం దురదృష్టకరం.

• ఫ్యాషన్‌గా మారిన రౌడీయిజం

రాజకీయ నాయకుల పుణ్యమా అని జిల్లాలో రౌడీయిజం ఫ్యాషన్‌గా మారిపోయింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇది మరింత ప్రబలిపోయింది. డివిజన్‌కు ఒక కార్పొరేటర్ ఉన్నట్లు, వార్డుకు ఒక కౌన్సిలర్ ఉన్నట్లు ఒక్కో వీధికి ఒక్కో రౌడీ తయారయ్యాడు. రాజకీయ నాయకులు వీరికి ప్రత్యేకమైన గౌరవం ఇవ్వడంతో ఇది చూసిన యువకులు రౌడీయిజం పట్ల ఆకర్షితులయ్యారు. దీంతో గడిచిన ఆరేళ్ల కాలంలో రౌడీషీటర్ల సంఖ్య విపరీతంగా పెరిగింది. జిల్లావ్యాప్తంగా 982 మంది రౌడీషీటర్లు ఉండగా నెల్లూరు నగరంలో మాత్రం 480 మంది ఉన్నారు. అంటే డివిజన్‌కు పది మంది చొప్పున రౌడీ షీటర్లు ఉన్నారన్నమాట.

వేళ్లూనుకొంటున్న గ్యాంగ్‌ల సంస్కృతి



సమాజంలో అక్కడక్కడా నేరప్రవృత్తి కలిగిన వారు ఉండటం సహజం. వారిపై రౌడీ షీట్లు ఓపెన్ చేయడం సహజం. రౌడీషీటర్ అయినంత మాత్రానా ఎప్పుడూ రౌడీయిజంతోనే బతుకుతాడని కాదు. వీరి నేరాలు ఒకటి రెండింటికి పరిమితమై ఉండవచ్చు. లేదా ప్రస్తుతం నేర ప్రపంచానికి దూరంగా జీవిస్తూ ఉండవచ్చు. ఇలాంటి వారితో ప్రమాదం లేదు. కానీ గత కొన్నేళ్లుగా నేరాలనే వృత్తిగా చేసుకొని గ్యాంగ్‌లు తయారయ్యాయి. ఇద్దరు, ముగ్గురు రౌడీలు ఒక గ్యాంగ్‌గా ఏర్పడటం, వారికి ఒకరు నాయకత్వం వహించడం, ఈ గ్యాంగ్‌స్టర్‌కి ఒక రాజకీయ నాయకుడు అండగా నిలబటం ఎక్కువైపోయింది. రాజకీయ నాయకులు సంపాదనే ధ్యేయంగా భూ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడంతో వీరికి రౌడీల అవసరం ఏర్పడింది. రౌడీలను ముందు పెట్టుకొని సెటిల్‌మెంట్లు చేసే సంస్కృతి వేళ్లూనుకొంటోంది. రాజకీయ నాయకుల కోసం రౌడీలు దందాలు చేస్తున్నారు. రౌడీల కోసం రాజకీయ నాయకులు పోలీస్ శాఖను ప్రభావితం చేస్తున్నారు. వెరసి జిల్లాలో రౌడీయిజం గ్యాంగ్‌ల స్థాయికి విస్తరించింది.

• 2వేల మందిపై సస్పెక్టడ్ షీట్లు

నేర ప్రవృత్తి కలిగిన వారిని గుర్తించి వారిపై సస్పెక్టడ్ షీట్లు తెరుస్తారు. అంటే వీరు రౌడీషీటర్లకన్నా తక్కువేమీ కాదు. నేర ప్రవృత్తిలో వారికన్నా వీరే ప్రమాదకరం. రాజకీయ జోక్యం, పోలీసు శాఖలో అవినీతి లేకుండా నిష్పక్షికంగా వ్యవహరించి ఉంటే వీరిలో చాలా మందిపై ఇప్పటికే రౌడీ షీట్లు ఓపెన్ చేసి ఉండాల్సింది. అయితే రాజకీయ నాయకులు వీరిని కాపుకాయడంతో చాలా మందిపై రౌడీషీట్లు తెరవలేదు.

• ఇకనైనా మేలుకొంటారా!?

జీవితఖైదీ శ్రీకాంత్, ఈయన ప్రియురాలు అరుణల వ్యవహారంతో రాష్ట్ర ప్రభుత్వం ఉలిక్కిపడింది. దీంతో నిన్న మొన్నటి వరకు అచేతనంగా ఉన్న పోలీసు శాఖలో కదలిక వచ్చింది. జిల్లావ్యాప్తంగా రౌడీషీటర్ల భరతం పట్టడానికి ఉపక్రమించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో డీజీపీ స్థాయిలో నెల్లూరు జిల్లాపై దృష్టి సారించారు. రౌడీమూకలను కట్టడి చేసే పనులు మొదలవుతున్నాయి. అయితే ఇవి ఎంతవరకు రౌడీమూకల్లో భయాన్ని కలిగిస్తాయి, ఎంతవరకు వారి నేరప్రవృత్తిని మార్చగలుగుతాయి అనేది పోలీసు వ్యవహారశైలి మీద ఆధారపడి ఉంది.

వెంకయ్యస్వామి ఆశ్రమంలో పూజితారెడ్డి పూజలు

వెంకటాచలం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె, వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు కాకాణి పూజితారెడ్డి దంప తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట జడ్పీటీసీ సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీ పీ కోదండరామిరెడ్డి, నేతలు వెంకటశేషయ్య, మోహన్ నాయుడు, భాస్కర్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు తదితరులు ఉన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9594
వెండి కిలో ధర	రూ. 119900
వెండి ఒక గ్రాము	రూ. 123.00

రేపటి నుంచి స్మార్ట్ బియ్యం కార్డుల పంపిణీ



కార్డు చూపుతున్న తహసీల్దార్ రమాదేవి

మనుబోలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25వ తేదీనుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్డుదారులందరికీ ప్రభుత్వం అందజేసిన కొత్త స్మార్ట్ రైస్‌కార్డులను పంపిణీ చేయబోతున్నామని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె శనివారం కొత్త స్మార్ట్ రైస్ కార్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 19 పంచాయతీలకు 28 రేషన్‌షాపులు ఉన్నాయి. వీటిలో 12,330 కార్డులు ఉన్నాయి. వీరందరికి స్మార్ట్ కార్డులు వచ్చాయన్నారు. 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పంచాయతీల వారీగా సచివాలయ సిబ్బంది ఇళ్ళకే వచ్చి అందిస్తారన్నారు. పౌరసరఫరాల ఉప తహసీల్దార్ ఐ. రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈసీసీఈ డే

రాపూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపినాపి సెక్టార్ గిలకపాడు-1 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీవో సునంద మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం ఆవశ్యకత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుప్రజ, ఏడబ్ల్యూసీ కవిత, తల్లులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతిని కలిసిన చిరు వ్యాపారులు

ఇందుకూరుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు, పాములవారిపాలెం, డేవిస్‌పేట, చట్టివారి కండ్రిగ, ఇందుకూరుపేట, పల్లిపాడు, తదితర గ్రామాలకు చెందిన 400 కుటుంబాలు చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. వీరందరూ మండల బీజేపీ అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని నివాసంలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కలిశారు. రోడ్డుమార్జిన్ వ్యాపారం చేసుకునే విధంగా తమకు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అనుమతులు ఇప్పించాలని ఆమెను కోరారు. కార్పొరేషన్ సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ మంత్రి నారాయణతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వీరేంద్రచౌదరి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు

ముత్తుకూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ముత్తుకూరులోని ఎరువుల దుకాణాల్లో శనివారం వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పొదలకూరు సబ్ డివిజన్ సహాయ సంచాలకులు శివనాయక్ మండల వ్యవసాయ అధికారి జ్యోత్స్నరాణి ఎరువుల దుకాణాల్లోని నిల్వలను పరిశీలించారు.

మనుబోలు : ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు యూరియా అమ్మితే దుకాణం లైసెన్సులు రద్దు చేస్తామని నెల్లూరు ఏడిఏ శ్రీదేవి అన్నారు. ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు.

డీజే మోగితే.. గుండె ఆగితే!

బాధ్యులెవరు? అంటున్న ప్రజలు

గణేశ్ వేడుకల్లో డీజే వద్దంటున్న భక్తులు



ఇందుకూరుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఏటా వినాయక చవితి సంబరాలతో ఊరూవాడ హోరెత్తిపోతుంది. అయితే కొన్ని సంవత్సరాలుగా భక్తిశ్రద్ధల మాట గణపతికెరుక.. డీజే శబ్దాలతో భక్తులకు గుండె పోటు వచ్చినంత పనవుతోంది. చాలాచోట్ల డీజే హోరుకు కొన్ని గుండెలు ఆగిపోయిన సంఘటనలు కూడా లేక పోలేదు. వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని పూజించడం కంటే కొంతమంది నిర్వాహకులు ఆధిపత్యం ప్రదర్శించడంలోనే గొప్పదనం ఉందని భావిస్తున్నారు. దీంతో హంగు, ఆర్భాటాలతో వేడుకలు నిర్వహించేందుకు పోటీ పడుతున్నారు. టపాసులు, మైకులు, డీజేలతో పల్లెలు, పట్టణాలు, నగరాలు మార్మోగిపోతున్నాయి. దీనిని తప్పని పెద్దవారు చెప్పలేకపోవడం, చెప్పినా కుర్రకారు వినకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. డీజే సౌండును అవసరానికి మించి పెంచడం వల్ల గణేష్ వేడుకల్లో వారం రోజుల పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారు వినాయక చవితి వస్తోందంటే భయపడిపోతున్నారు.

డీజే సౌండ్.. 120 నుంచి 150 డెసిబల్స్!

వినాయక ఉత్సవ మండపాల వద్ద కొంతమంది నిర్వాహకులు భక్తులకు సౌకర్యంగా వేడుకలు నిర్వహించాల్సిందిపోయి పెద్ద తలనొప్పిగా మారారన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా మైకు శబ్దం 50 నుంచి 55 డెసిబల్స్ లోపు ఉండాలి. అలాంటిది డీజే సౌండ్‌ను 120 నుంచి 150 డెసిబల్స్ వరకు పెంచి పిచ్చి పిచ్చి డ్యాన్సులతో పిల్లలు, యువకులు ఊగిపోతుంటారు. ఫలితంగా జనావాసాల మధ్య మనుషుల గుండెలతో పాటు ఇళ్లలోని సామాన్లు కూడా చెదిరిపోయేలా బెంబేలెత్తిస్తున్నారు. ఒకప్పుడు వినాయక చవితి వస్తుందంటే తొలి పండుగని అందరూ భక్తితో ఎదురుచూసేవారు. కానీ నేటి నేడు.. 'అమ్మో వినాయక చవితి వస్తుందా' అని కంగారు పడే పరిస్థితి దాపురించింది. ఇందుకు ప్రధాన కారణం.. డీజే శబ్ద కాలుష్యమే! అని పలువురు పర్యావరణవేత్తలు చెబుతున్నారు. దీంతోపాటు నిమజ్జనాల్లో అపశృతులు, గొడవలు జరుగుతాయేమోనని భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని వినాయక చవితిని ఆహ్లాదకర వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని భక్తులు, మహిళలు, హృద్రోగులు కోరుతున్నారు. డీజే వల్ల ప్రాణహాని జరిగితే అందుకు బాధ్యులు గణేష్ మండపాల నిర్వాహకులే అవుతారు. అందుకే డీజేకి పూర్తిగా అనుమతి నిరాకరించాలని, పోలీసు అధికారులు ఆ దిశగా నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యువతను ప్రోత్సహించడమే ఇషా లక్ష్యం

త్రోబాల్, వాలీబాల్ క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని యువతను క్రీడల్లో ప్రోత్సహించడమే ఇషా ఫౌండేషన్ లక్ష్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శనివారం బుచ్చిరెడ్డిపాళెం డీఎల్ఎన్ఆర్ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో ఇషా గ్రామోత్సవం పేరిట నిర్వహించిన రూరల్ ప్రీమియర్ లీగ్ 2025 జిల్లా స్థాయి త్రో బాల్, వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇషా ఫౌండేషన్ వలంటీర్, బ్రహ్మ చారి స్వామి, అంబర, మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పతాకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నస్రీన్‌ఖాన్, కౌన్సిలర్లు వైష్ణవి, లక్ష్మీకాంతమ్మ, మాజీ ఎంపీటీసీ పర్వీన్, టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీని వాసులు, హైస్కూలు వ్యవస్థాపకులు దొడ్ల కోదండ రామిరెడ్డి, మురళీ కృష్ణారెడ్డి, సీఐ శ్రీని వాసులురెడ్డి, పీఈటీలు, ఇషా ఫౌండేషన్ సిబ్బంది, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

విడవలూరు : వందేళ్ల నాటి చరిత్ర కలిగిన ప్రాచీన దేవాలయమైన శ్రీ అళఘనాథ స్వామి దేవాలయ అభివృద్ధికి నూతన పాలకమండలి కృషి చేయాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని పార్లపల్లి అళఘనాథ స్వామి దేవాలయానికి కొత్తగా పాలక మండలిని నియమించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే, ఆలయ ఈవో మోహన్ రావు సమక్షంలో ఆలయ చైర్మన్‌గా ఉచ్చూరు సుదీప్‌రెడ్డి, సభ్యులుగా మడపర్తి రాజేశ్వరి, చౌటూరు గిరి, వంగపాటి వరలక్ష్మీ, కాకుటూరు సుమతి, నిమ్మల శశికుమార్, యర్రంశెట్టి సుజాత, బండ్ల సునీత ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు వేటూరు హరిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధీర్ గౌడ్, ఈస్ట్రన్‌చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, నాయకులు వేగూరు చంద్రారెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వినాయక చవితి వేడుకలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ రవి నాయక్, ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి

ముత్తుకూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపులపై ప్రత్యేక నిబంధనలు అమల్లో ఉన్నాయని కృష్ణపట్నం సీఐ రవి నాయక్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన ఎస్ఐ శ్రీనివాసులురెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. చట్టపరమైన నిబంధనలు తప్పనిసరిగా పాటిం చాలని హెచ్చరించారు. విగ్రహాల ఏర్పాటు కోసం ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డీజే స్పౌండ్లు, లౌడ్ స్పీకర్లు పెట్టరాదని, అశ్లీల నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

రాపూరు: ఈ నెల 27వ తేదీ నుంచి జరిగే వినాయక ఉత్సవాలకు నిర్వాహకులు పోలీస్ స్టేషన్‌లో అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ సత్యనారాయణ సూచించారు. శనివారం ఎస్ఐ వెంకటరాజేష్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. అనుమతిలేని మండపాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజే సౌండ్లు ఉండకూడదని, నిమజ్జనం రోజున అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కృష్ణపట్నంలో మౌలిక వసతుల కల్పనకు కృషి

ముత్తుకూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నం పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని టీఎన్‌టీయూసీ మండల అధ్యక్షులు రాగాల శివకృష్ణ తెలిపారు. శనివారంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆదేశాల మేరకు పారిశుధ్యంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించామన్నారు. కృష్ణపట్నంలో డ్రముల్లో నీరు నిల్వ ఉంచి వాడుతున్నందున వ్యాధులు ప్రబలేప్రమాదం ఉందని ఎమ్మెల్యే సహకారంతో ప్రతి ఇంటికి కుళాయితో మంచినీరు అందజేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గిరిజన కాలనీలోని గిరిజనులకు ఆధార్ రేషన్‌కార్డులను అధికారుల సహకారంతో ఇప్పించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, మల్లికార్జున, జంగయ్య, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'టంగుటూరి' జయంతి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధులు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయం తిని ఎంపీడీఓ, తహసీల్దారు కార్యాలయంతోపాటు పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమా లలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. ఈ వేడుకల్లో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి, కమిషనర్ బాలకృష్ణ, తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ నారాయణరెడ్డి, హౌసింగ్ ఏఈ పెంచలయ్య, ఆర్ఐ శాంతిప్రియ, వీఆర్వోలు, సిబ్బంది, ఎంఈఓ దిలీప్‌కుమార్, కౌన్సిలర్లు నివాళులర్పించారు.

లక్ష్మీనృసింహుడి కల్యాణం



రాపూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోనలో లక్ష్మీనృసింహుడి కల్యాణం శనివారం కన్నులపండువగా నిర్వహించారు. తెల్లవారుజామున అభిషేకాల అనంతరం చందనాలంకరణలో భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు. ఉదయం దేవేరులతో కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, రాత్రి ఊంజల్‌సేవలను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఉచిత ప్రసాదాలతోపాటు అన్నప్రసాదం అందించినట్లు ఆలయ ఉపకమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

పరిశుభ్రతతోనే అంటువ్యాధుల నియంత్రణ



వెంకటాచలం : ప్రతిజ్ఞ చేయిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత పాటిస్తే అంటు వ్యాధులను నియం త్రించవచ్చుని బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. శని వారం బుచ్చి నగర పంచా యతీలో కమిషనర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భారీ ర్యాలీ చేపట్టారు. "మూన్ సూన్ హైజీన్" కాన్సెప్ట్‌తో పట్టణంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నియంత్రణకు మురుగు కాలువల్లో చైర్‌పర్సన్ ఆయిల్ బాల్స్ వేశారు. పారిశుధ్య కార్మికులు కాలువల్లో దోమల మందును పిచికారీ చేశారు. వైస్ చైర్మన్లు శివకుమార్‌రెడ్డి, నస్రీన్‌ఖాన్, కౌన్సిలర్లు, నగర పంచాయతీ, సచి వాలయాల సిబ్బంది, మెప్మా సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మనుబోలు: మనుబోలు గ్రామంలో పంచాయతీ అధికారులు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. మంచినీటి ట్యాంకు వద్దకు వెళ్లి క్లోరినేషన్, నీటి పరీక్షలపై సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. మురుగుకాలువలను ఇన్‌చార్జి ఎంపీడీవో ముజీబున్నీసా, డిప్యూటీ ఎంపీడీవో నారాయణలు శుభ్రం చేశారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ పారిశుధ్య కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు గరుడయ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం : పరిసరాలు శుభ్రంగా ఉంచుకున్నప్పుడే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. మండలంలోని కాకుటూరు గ్రామంలో శనివారం స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించారు. మురుగునీరు నిల్వలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ శిరీష, టీఏఎస్ బాలకృష్ణ, సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, ఏఎన్ఎం వామక్షి, ఫీల్డ్ అసిస్టెంట్లు ఆది తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో జాతీయ అంతరిక్ష దినోత్సవం




పోటీలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ సునీత

వెంకటాచలం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ఎలోక్యూషన్, వ్యాసరచన, పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ముఖ్య అతిథిగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత విచ్చేసి మాట్లాడారు. అంతరిక్ష పరిశోధన దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎ శివశంకర్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఎన్ఓ గోపాల్, డాక్టర్ వై విజయ, డాక్టర్ పుండరీ, సుబ్బారెడ్డి, భాగ్యశ్రీ తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాలపై విచారణ

ముత్తుకూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై శనివారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. మండల కేంద్రంలోని ముత్తుకూరు బీసీ కాలనీలో బలహీన వర్గాల గృహ నిర్మాణం కోసం అప్పట్లో మంత్రిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసి ప్రభుత్వ భూమిలో యనమల గోపాల్ అనే వ్యక్తి అక్రమ నిర్మాణాలు చేపట్టారని పట్టణ టీడీపీ అధ్యక్షుడు బొలిగర్ల శ్రీనివాసులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు శనివారం అక్కడి నిర్మాణాలను పరిశీలించారు. భూమి సర్వే నెంబర్, భవన యజమానికి ఉన్న హక్కులు వంటి విషయాలపై విచారించారు. సమగ్రంగా దర్యాప్తు చేస్తామని, అక్రమ కట్టడం అని తేలితే చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

రావి ఆకుపై వెంకయ్యస్వామి



రావి ఆకుపై వెంకయ్యస్వామి చిత్రం

పొదలకూరు, ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి) : గొలగమూడి శ్రీభగవాన్ వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని మహమ్మదాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్ పచ్చా పెంచలయ్య భగవాన్ వెంకయ్యస్వామి సూక్ష్మ చిత్రాన్ని రావి ఆకుపై అద్భుతంగా గీశారు. వెంకయ్య స్వామి నడయాడిన ప్రాంతమని, ఆయనపై ఉన్న అపారమైన భక్తితోనే ఈ చిత్రాన్ని గీసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

వెంకటాచలం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు... వెంకటాచలం గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి షేక్ నస్రూద్దీన్ ఇంటికి వెళ్లేందుకు రహదారి దాటుతుండగా ఓ వాహనం వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నస్రూద్దీన్‌కు తీవ్ర గాయాల య్యాయి. ఢీకొన్న వాహనాన్ని ఆపకుండా గూడూరు వైపు వెళ్లినట్లు స్థానికులు వెల్లడించారు. 108 వాహనంలో క్షతగాత్రుడిని నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారిపై లారీ దగ్ధం

వెంకటాచలం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలం సమీపంలోని ఆర్టీసీ జోనల్ శిక్ష ణా కళాశాల వద్ద జాతీ య రహదారిపై శనివా రం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ లారీ దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. చెన్నై వైపు ఐరన్ లోడ్‌తో వెళ్తున్న ఓ లారీని రహదారి పక్కనే నిలిపి వంట చేసుకుం టుండగా షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారి గా మంటలు చెలరే గాయి. దీంతో లారీ డ్రైవర్, క్లీనర్ లారీ నుంచి బయటకు వచ్చేసి టోల్ సిబ్బందికి సమాచారం అందించారు. మంటలు వ్యాపించడంతో లారీ క్యాబిన్ పూర్తిగా దగ్ధమైంది. టోల్ అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. ఈ సంఘటనతో ఆ మార్గంలో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ

నెల్లూరు(క్రైం) ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన నగరంలోని బీవీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమా చారం మేరకు బీవీనగర్ లో మహేష్‌కుమార్ నివాసం ఉంటున్నారు. ఆయన ఈనెల 21న కుటుంబసభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 11 గ్రాముల బంగారు కమ్మలు, వెండి లక్ష్మీదేవి బొమ్మను అపహరించుకు వెళ్లారు. శనివారం ఇంటికి వచ్చిన మహేష్‌కుమార్ చోరీ ఘటనపై వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్



వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు (క్రైం) ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి): ఇళ్లలో వరుస చోరీలకు పాల్పడుతూ తప్పించుకొని తిరుగు తున్న ఓ నిందితుడిని నగ రంలో ని నవాబుపేట పోలీసు లు శనివారం అరెస్ట్ చేశా రు. నవాబుపేట పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జీ. వేణుగోపాల్‌రెడ్డి నిందితుడి వివరాలను మీడి యాకు వెల్లడించారు. వెంకటేశ్వరపురం రైలువీధిలో సయ్యద్ సబ్బీర్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన ఈనెల 20న కుటుంబంతో కలిసి ఉదయగిరిలో గంధమహోత్సవానికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగుడు ఆయన ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 10 సవర్ల బంగారు ఆభరణాలు దోచుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితుడు అదే ప్రాంతానికి చెందిన అరవ సుబ్రమణ్యంగా గుర్తించారు. పరారీలో ఉన్న నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నారు. వ్యసనాలకు బానిసైన నిందితుడు చోరీలకు పాల్ప డుతున్నాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనపరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్ఐ కే. భోజ్యానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం) ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నగరంలోని విజయమహల్ గేటు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 45 నుంచి 50 ఏళ్ల లోపు వయసు కలిగి, లేత పసుపు రంగు గల ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, నలుపురంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ ఎన్. హరిచందన సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం కోసం జీజీహెచ్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

నెల్లూరు(క్రైం) ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్‌సీసీ కాలనీలోని శనివారం ఓ ఇంట్లో విద్యుత్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. డైకాస్‌రోడ్డు ఎన్‌సీసీ కాలనీలో సుధాకర్ కుటుంబం నివాసం ఉంటోంది. శనివారం సుధాకర్ కుటుంబం ఇంట్లో లేని సమ యంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో మంటలు వ్యాపించాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బం ది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ.లక్షకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

ఉదయగిరిని జిల్లా చేయాలి

ఉదయగిరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల తరబడి అభివృద్ధికి నోచుకోని మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని జిల్లా చేయాలని కోరుతూ శనివారం వైసీపీ నాయకులు తహసీల్దారు ఎల్ రామ్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు, సరిహద్దులు, పేర్ల మార్పులు, చేర్పులకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించిందన్నారు. అందులో భాగంగా ఉదయగిరిని జిల్లా చేయాలని వినతిపత్రం అందజేశామని వారు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఉదయగిరి కేంద్రంగా కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 21 మెట్ట మండలాలను కలిపి జిల్లా చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పెద్దిరెడ్డి సోమిరెడ్డి, ముట్టుకుంద తిరుపతిరెడ్డి, ఉప్పుటూరి హరి, ఈర్ల శ్రీనివాసులు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.55,54,853

● కసుమూరులో వక్ఫ్‌బోర్డు అధికారుల తీరుపై విమర్శలు

వెంకటాచలం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు మస్తాన్‌వలీ దర్గా హుండీల ద్వారా రూ.55,54,853 ఆదాయం వచ్చినట్లు వక్ఫ్ బోర్డు అధికారులు వెల్లడించారు. హుండీ లెక్కింపు నాలుగు రోజులు కొనసాగగా, కొందరు చేతివాటం ప్రదర్శించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. తొలి మూడు రోజులే దాదాపు లెక్కింపు పూర్తి కాగా నాలుగవ రోజైన శనివారం సాయంత్రం పంచనామా ప్రక్రియ పూర్తి చేశారు. ముఖ్యంగా లెక్కింపులో పాల్గొన్న వక్ఫ్‌బోర్డు అధికారులు, సిబ్బందిలో పోలీసులు కేవలం సిబ్బందిని మాత్రమే పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. అధికారులను తనిఖీ చేయకుండా బయటకు పంపించి వేశారని, లెక్కింపు సమయంలో మాటి మాటికీ అధికారులు బయటకు లోపలికి తిరుగుతూనే ఉన్నారంటూ ఆరోపించారు. మూడు రోజుల పాటు నోట్లు లెక్కించిన వక్ఫ్‌బోర్డు అధికారులు, సిబ్బంది కనీసం చిల్లర లెక్కించకుండానే తూకం ప్రకారం 800 కేజీలకు పైగా ఉన్న చిల్లరను కేవలం రూ.3.20 లక్షలు బయటివారికి ఇచ్చేశారు. ఆ చిల్లరను తీసుకునేందుకు పలువురు పోటీపడ్డారు. నోట్లు లెక్కించిన వారు చిల్లర కూడా లెక్కించి ఉంటే బాగుండేదని స్థానికులు భావిస్తున్నారు. అలా కాకుండా తూకం ప్రకారం ఇవ్వడంపై పెదవి విరుస్తున్నారు. రెండు నెలల కిందట కేవలం రెండు హుండీలను లెక్కించగా రూ.44,01,700 ఆదాయం రాగా, ఆ సమయంలో మిగిలిన 6 హుండీలను లెక్కించ కుండా వదిలేశారు. ఆ హుండీలతోపాటు రొట్టెలపండుగ ఆదాయం అంతా కలిపి రూ.55, 54,853 లక్షలు మాత్రమే రావడంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల కిందట కేవలం రెండు హుండీలకే రూ. 44 లక్షల ఆదాయం రాగా, ఇప్పుడు సుమారు 10 హుండీల వరకు లెక్కించగా రూ.55,54,853 మాత్రమే ఉండడంపై స్థానికులు బహిరం గంగా విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంపై దర్గా ఈవో షరీఫ్ మాట్లాడు తూ దర్గాలోని హుండీలను పకడ్బందీగా నిర్వ హించినట్లు చెప్పారు. ఎలాంటి లోపాలు జరగలేదని స్పష్టం చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	105
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216

కోడిగుడ్ల ధర (100): 535

ఉచిత వైద్య పరీక్షలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం మెడికవర్ హాస్పిటల్ సహకారంతో వాకర్స్‌కు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ విజయ్‌కుమార్, రమేష్‌బాబులు బీపీ, షుగర్‌లతోపాటు ఈసీజీ టెస్టులు నిర్వహించి, సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్. అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పీ. రవిచంద్ర, సభ్యులు డీవీ.సుబ్బరాజు, గోపాల్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంపై ఫిర్యాదులొస్తే చర్యలు

నెల్లూరు (జడ్పీ), (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అంతరాయంపై తరచూ ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ టెక్నికల్ డైరెక్టర్ కే.గురవయ్య హెచ్చరించారు. నగరంలోని విద్యుత్‌భవన్‌లో గల ఎస్‌ఈ చాంబర్‌లో ఎస్‌ఈ వీ. విజయన్‌తో కలిసి ఆయన టౌన్‌డివిజన్ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించడమే తమ లక్ష్యమన్నారు.

న్యూస్ బాక్స్

నిమజ్జన ఏర్పాట్లపై మేయర్ సమీక్ష

నెల్లూరు(క్రైం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయకచవితిలో భాగంగా నిమజ్జన ఏర్పాట్లను లోప రహితంగా నిర్వహించాలని ఎన్ఎంసీ మేయర్ స్రవంతి అధికారులకు సూచించారు. తన చాంబరులో శనివారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. గణేష్ ఘాట్ వద్ద ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం వహించకుండా చూడాలని సూచించారు. కౌన్సిల్ సమావేశాల్లో ప్రతిపాదించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

లక్షకుపైగా కుటుంబాల్లో చవితి సంబరాలు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది నగరంలో లక్షకుపైగా హిందూ కుటుంబాల్లో వినాయకచవితి సంబరాలు జరుగుతున్నాయని సింహపురి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కొండపల్లి శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమితి పరిధిలోని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వెయ్యి మండపాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అపార్టుమెంటు కూడళ్లలో 500 గణేష్ విగ్రహాలకు పూజలు జరుగుతాయని వివరించారు. క్రాంతినగర్, చిన్నబజార్, శివాజీసెంటర్, కాపువీధి, వేదాయపాలెం, తదితర సెంటర్లలో 25 అడుగుల వినాయక ప్రతిమలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నిమజ్జన ఏర్పాట్లపై అసంతృప్తి

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : మూలాపేట స్వర్ణాల చెరువులో గణేష్ నిమజ్జనం ఘాట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. చేస్తున్న పనులను శనివారం విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి నాయకులు పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వినాయక చవితి నాటికే నిమజ్జనం ఏర్పాట్లు పూర్తి కావాల్సి వుంది. త్వరితగతిన ఏర్పాటుతో పాటు మహిళా భక్తుల కోసం పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సమితి నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు పిట్టు సత్యనారాయణ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మైపాడుగేట్ సెంటర్‌లో 3, 5 డివిజన్లకు చెందిన మిత్ర మండలి గణేష్ ఉత్సవ కమిటీ, ఏబీ యూత్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలకు హాజరుకావాలని నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డికి నిర్వాహకులు శనివారం ఆహ్వాన పత్రిక అందచేశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 5వ డివిజన్ అధ్యక్షుడు లెక్కల వెంకరెడ్డి, యూత్ ప్రెసిడెంట్ ఎస్‌కె.కరిముల్లా, నాయకులు గౌతమ్, 3వ డివిజన్ నాయకులు అశోక్‌చౌదరి, మదన్, సునీల్, చిన్నశ్రీను, సాయి, శ్రీధర్, బీజేపీ, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు (సాంస్కృతికం) : శ్రీ మహాగణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి మహా గణపతి ఆగమ ఉత్సవం జరిగింది. చవితి పూజలు అందుకునేందుకు ఏర్పాటు చేసిన మహాగణపతిని మేళతాళాలు, బాణసంచా వేడుకలతో పేట ఉత్సవం నిర్వహించి మండపంలో ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి హాజరై భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

విద్యార్థి దశ నుంచే నూతన ఆలోచనలు రావాలి

నెల్లూరురూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఆలోచన చేసే శక్తి విద్యార్థి దశ నుంచే రావాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి అన్నారు. శనివారం నెల్లూరురూరల్లోని కనుపర్తిపాడు వద్దనున్న ఇధాకా స్కూల్లో కార్నివాల్ ఫెస్ట్-2025ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తరగతుల వారీగా విభిన్నమైన ఆలోచనలతో అనేక నూతన వస్తువులను తయారు చేయడం, వాటిని ఆకట్టుకునే విధంగా ప్రదర్శనకు పెట్టడం, ఆపై విక్రయాలు జరిపి వచ్చిన నగదుతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ జీఎం జీవన్, హెచ్ఎం శోభా లక్ష్మీనారాయణ్ పాల్గొన్నారు.

పెరుగు రామకృష్ణకు ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : యునెస్కో గుర్తింపు కలిగిన వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పోయెట్స్‌కు శాశ్వత సభ్యుడిగా నెల్లూరుకు చెందిన పెరుగు రామకృష్ణ ఎంపికయ్యారని ఆ సంస్థ అధ్యక్షురాలు, కవయిత్రి డాక్టర్ మారియా యుజెనీస్, సోబరీస్ ఓ ప్రకటనలో తెలిపారు. తమ సంస్థ సెప్టెంబరు 21 నుంచి 26 వరకు మెక్సికోలోని న్యూ వయోలిన్ ప్రపంచ కవుల సమ్మేళనం నిర్వహించనున్నదని, ఆ కార్యక్రమానికి రామకృష్ణ హాజరుకావాలని కోరారు.

ఆదర్శప్రాయుడు టంగుటూరి ప్రకాశం పంతులు : డీఆర్వో

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరు ప్రకాశం పంతులు ఆదర్శప్రాయుడని డీఆర్వో హుస్సేన్ సాహెబ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని శంకరన్‌హాల్లో ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రజా సేవకే జీవితాన్ని అంకితం చేసిన ప్రకాశం పంతులు నిస్వార్థ జీవితం భావితరాలకు ఆదర్శమని అన్నారు.

● ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం యువతకు ఆదర్శమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. నగరంలోని ఆమె నివాసంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయన త్యాగం చిరస్మణీయమన తెలిపారు.

● డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ నాగరాజకుమారి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ అయన ప్రజా సేవ అందరికీ స్ఫూర్తి దాయమని చెప్పారు.

● మెప్మా కార్యాలయంలో పీడీ లీలారాణి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఐబీ అంకయ్య, ఏవో సుధాకర్, ఎల్‌హెచ్ సుధాకర్, ఎస్ఎస్ కాంతయ్య, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని, ప్రతి ఒక్కరూ అవినీతిపై పోరాటం చేయాలని వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పిలుపునిచ్చారు. శనివారం ఆంధ్రకేసరి జయంతి సందర్భం గా నగరంలోని ఏసీ మార్కెట్ వద్ద గల ప్రకాశం పంతులు విగ్రహానికి బ్రాహ్మణ సంఘాలు, టీడీపీ నాయకులతో కలిసి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల నాయకులు వాసుదేవరావు, శ్రీకంఠం రమణయ్య, వెంకటేశ్వర్లు, టీడీపీ నేతలు సుబాన్ బాషా, శేషయ్యనాయుడు, రామిరెడ్డి, జేవీరెడ్డి, విశ్వం, మౌళి, పూజిత్, శ్రీధర్, గడ్డం విజయలక్ష్మి, ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న టీడీపీ నేతలు



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, అధికారులు, సిబ్బంది



టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో హుస్సేన్ తదితరులు



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

● నెల్లూరు(వెంకటేశ్వరపురం), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి ముందుగా ఆర్డీవో అనూష పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో నిర్మలానందబాబా పాల్గొన్నారు.

● నెల్లూరు(క్రైం) (ఆంధ్రజ్యోతి): నిజాయితీకి మారుపేరు ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని, ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ జీ. కృష్ణకాంత్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు జరిగాయి. ప్రకాశం చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● నెల్లూరు (జడ్పీ), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం టంగుటూరి ప్రకాశం పం తులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ ప్రకాశం పంతులు ప్రజాసేవకుడిగా దేశచరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో ఆత్మకూరు జడ్పీటీసీ లక్ష్మీ ప్రసన్న, జడ్పీ సీఈవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నికకు ఓటర్ల నమోదు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : సినీ ఆర్కెస్ట్రా, మ్యూజికల్స్ అసోసియేషన్ కార్యవర్గ పదవీ కాలం పూర్తయినందున, కొత్త కార్యవర్గ ఎన్నికకు ఓటర్లు నమోదు నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పీ.రాజశేఖర్ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఓటు నమోదు ఆదివారం నుంచి సెప్టెంబరు 10 వరకు జరుగుతుందన్నారు. గాయనీ గాయకులు, ఇన్‌స్ట్రుమెంట్ ప్లేయర్లు, ఆర్గనైజర్లు అంతా ఓటర్లుగా చేరాలని కోరారు. అసోసియేషన్‌లో అధ్యక్షుడు సహ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు 2, కార్యదర్శి జాయింట్ సెక్రటరీలు 3, ట్రెజరర్ 9 మంది పోస్టులకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. పరోక్షంగా ఈసీ మెంబర్లను ఎన్నుకుంటామని తెలిపారు. పూర్తి వివరాలకు 98482 46418 నంబరును సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో మిశ్ర, భాస్కర్‌రాయల్ పాల్గొన్నారు.

వాడవాడలా స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా 'వర్షాకాలంలో వరదలు, అంటువ్యాధుల నివారణ' అనే అంశంపై జిల్లా పోలీసు కార్యాలయంలో వరదలను ఎదుర్కొనేందుకు ఉపయోగించే సామగ్రిని శనివారం తనిఖీ చేశారు. పోలీసు మైదానం వరకు అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరెడ్డి, అడ్మిన్ ఆర్ఐ అంకమరావు, ఎంటీ ఆర్ఐ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని అన్ని స్టేషన్లలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

● నెల్లూరు(సిటీ), (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు నిషేధిత ప్లాస్టిక్‌ను దూరం పెట్టాలని కార్పొరేషన్ అధికారులు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్ర మాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో డీసీ చెన్నుడు, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఎంహెచ్‌వో కనకాద్రి పాల్గొన్నారు.

● నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత తెలిపారు. శనివారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. డీఎంహెచ్‌వోతో పాటు అధికారులు, సిబ్బంది చీపురు పట్టుకుని పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో డీసీఎంవో డాక్టర్ రమేష్, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుదీర్‌కుమార్, జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, డెమో కనకరత్నం, న్యూక్లియస్ వైద్యాధికారి డాక్టర్ సురేంద్ర, డీఎస్‌వో డాక్టర్ భాస్కర్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, ఏవో నిశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు



స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేస్తున్న కార్పొరేషన్ అధికారులు

● నెల్లూరు (జడ్పీ): మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. జడ్పీ కార్యాలయంలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చెత్త చెదరాలను తొలగించారు. ఆత్మకూరు జడ్పీటీసీ లక్ష్మీప్రసన్న, జడ్పీ సీఈవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రూరల్‌లో 90 శాతం హామీల అమలు

నెల్లూరురూరల్, ఆగస్టు 23,(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాదికే ప్రజలకు ఇచ్చిన హామీల్లో 90 శాతం నెరవేర్చిందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. మాజీ మేయర్ భానుశ్రీతో కలిసి స్త్రీశక్తి సమావేశాన్ని శనివారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా చిన్నాభిన్నం చేసినా, అపారమైన అనుభవంతో చంద్రబాబు సంపదను సృష్టిస్తూ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతున్నారన్నారు. సంక్షేమ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) :నగరంలోని ఏసీ సుబ్బా రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో భాగంగా శనివారం క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లు జరిగాయి. ఆదివారం ఉదయం సెమీఫైనల్స్, మధ్యాహ్నం ఫైనల్స్ పోటీలు జరుగుతాయని రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ముక్కాల ద్వారకనాథ్ తెలిపారు.

ఒంగోలు సభలకు సీపీఐ శ్రేణులు

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ శ్రేణులు ఒంగోలుకు వెళ్లేందుకు 3 బస్సులు, 4 కార్లను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 25 వరకు ఒంగోలులో 28వ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభను పార్టీ నేతలు, కార్యకర్తలు విజయవతం చేయాలని కోరారు. కోవూరు నుంచి నందిపోగు రమణయ్య, ఆత్మకూరు నుంచి మధు, కావలి నుంచి నేతల ఆధ్వర్యంలో కార్యకర్తలు రాష్ట్ర మహాసభకు తరలి వెళ్లారని ఆయన పేర్కొన్నారు.



జెండా ఊపి వాహనాలు ప్రారంభిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి

యువ ఓటర్ల రిజిస్ట్రేషన్‌పై దృష్టిపెట్టాలి : ఆర్డీవో

నెల్లూరు(వెంకటేశ్వరపురం) ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : అర్హత కలిగిన యువత ఓటర్లుగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని నెల్లూరు ఆర్డీవో అనూష పేర్కొన్నారు. నగరంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, బీఎల్‌వోలు ఉమ్మడిగా నూతన ఓటరు రిజిస్ట్రేషన్లను పరిశీలించాలన్నారు. అలాగే నూతనంగా పోలింగ్ బూత్‌లు అవసరం ఎక్కడుందన్న దానిపై పరిశీలన చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అనూష

చేతుల పరిశుభ్రత పాటించాలి : డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తప్పనిసరిగా చేతుల పరిశుభ్రత పాటిం చాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత అన్నారు. శనివారం నగరంలోని సంతపేట ప్రభుత్వ మోడల్ హై స్కూల్లో వ్యక్తిగత పరిశుభ్రత, వర్షాకాలంలో పరిస రాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సం దర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియచేశారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ నీటినిల్వలు లేకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఇన్‌చార్జ్ రాధయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దయాకర్, మలేరియా సహాయ అధికారి నాగార్జునరావు, కోటమిట్ట వైద్యాధికారి జునైద్ సిద్దిఖీ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్షాకాలంలో డ్రైన్‌లు పరిశుభ్రంగా ఉంచాలి

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం వర్షాల కారణంగా డ్రైన్లలో నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని 7వ డివిజన్ కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలోని నిండి ఉన్న కాలువలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత నీరు నియంత్రించ టానికి, వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండటానికి పరిశుభ్రత కార్యక్రమం విస్తృతంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పటువురు నేతలు పాల్గొన్నారు.



కాలువలు శుభ్రం చేయిస్తున్న కిన్నెర మాల్యాద్రి

విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాష్టమి సందర్భంగా ఇందు జ్ఞాన వేదిక త్రైత్వ సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి నిర్వహించిన భగవద్గీత శ్లోకరాత పరీక్ష పోటీల విజేతలకు శనివారం బహుమతి ప్రదానం జరిగింది. మొదటి బహుమతి వీ.చైత్రకు రూ.3వేలు, ద్వితీయ బహుమతి నాగలక్ష్మిప్రసన్నకు రూ.2500 నగదు అందజేసి అభినందించారు. 3వ బహుమతి రూ.1500తో పాటు నలుగురికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.



విజేతలతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి నాయకులు

డీఎస్సీలో ఉత్తమ ఫలితాలు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ ఫలితాల్లో నగరంలోని స్ఫూర్తి కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్ ఎల్. పద్మయ్య తెలిపారు. శనివారం విద్యా సంస్థలో జరిగిన అభినందన కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. తమ వద్ద శిక్షణ పొందిన అభ్యర్థులు వివిధ కేటగిరిల్లో రాష్ట్ర, జిల్లాస్థాయి ర్యాంకులు సాధించార న్నారు. ఎస్‌జీటీ విభాగంలో జే.వనజ 93.31 స్కోర్ తో మూడోర్యాంక్, ఎస్‌కే.హజహరుల్లా 90.6 స్కోర్‌తో ఐదోర్యాంక్, కే.భార్గవి 90 స్కోర్‌తో 9వ ర్యాంక్, పీ.రాజేశ్వరి 89.65 స్కోర్‌తో 11వ ర్యాంక్, పీ.భువ నేశ్వరి 89.13 స్కోర్‌తో 16వ ర్యాంక్, ఎస్‌కె. అతహరుల్లా 89.07 స్కోర్‌తో 17వ ర్యాంక్ సాధించారని పేర్కొన్నారు. ఎస్ఏ మ్యాథ్స్‌లో ఏ.నాగశ్రీవల్లి, జీ.సురేఖ, టీ.హనుమంతరావు, డీ.సునీత, బీ.గిరీష్, సుజాత, మాధవి, దివ్యభారతి తదితరులు ఉత్తమ ర్యాంకులు సొంతం చేసుకున్నారన్నారని తెలిపారు. వీరితోపాటు మరికొంతమంది ఉద్యోగాలు పొందారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

నువ్వు చేసిన అరాచకాలేంటో చెప్పమంటావా!?

● వైసీపీ నేత ఆనంపై రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ధ్వజం

నెల్లూరురూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : '2004 నుంచి 2014 వరకు నెల్లూరురూరల్ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా నువ్వు చేసిన అరాచకాలు, దందాలు, దౌర్జన్యాలు, హత్యల గురించి చెప్పనా!?' అంటూ వైసీపీ రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డిపై ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ములుముడి, దొంతాలి, కనుపర్తిపాడు గ్రామాలలో జరిగిన హత్యలు సంగతేమిటని ప్రశ్నించారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎక్కడా దందాలు, హత్యలు, అరాచకాలు చేయించిన చరిత్ర లేదన్నారు. అలా ఉండబట్టే వైసీపీ ప్రభుత్వంలో జగన్‌ను వ్యతిరేకించి బయటకు వచ్చినా ఏం చేయలేకపోయారని పేర్కొన్నారు. చంద్రబాబు, లోకేష్ తమ చేతులు కట్టేసి కక్ష సాధింపులకు వెళ్లవద్దని చెప్పడంతోనే మీరంతా ప్రశాంతంగా ఉండగారని ఆగ్రహించారు.



వెంకయ్యస్వామికి
సింహవాహన సేవ

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి) : వెంకయ్యస్వామి 43వ ఆరాధ నోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం ఉదయం నిత్య పూజలతో పాటు సింహ వాహన సేవ ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. జంతువుల్లో సింహం ప్రత్యేకమైనదని, అదే తరహాలో మనిషి కూడా ఇతర ప్రాణుల కంటే భిన్నమైన రీతిలో బతకాలని సూచించడాని కన్నట్లు స్వామి సింహవాహనంపై ఊరేగారు. వెంకయ్య స్వామిని కనులారా తిలకించడానికి భక్తులు పోటీలు పడ్డారు. రాత్రికి వెంకయ్య స్వామికి గరుడవాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది. మహిళలు తమ వాకిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్దారు. గొలగమూడి గ్రామస్థులు స్వామి వారి ఊరేగింపు తమ వాకిలి ముందు ఒక్క క్షణం ఆగినా చాల న్నంత ఉద్వేగంతో కర్పూర హారతులు పట్టారు. ఆరాధనోత్స వాల్లో చివరి రోజైన ఆదివారం ఉదయం 10 గంటలకు వెంకయ్యస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. రాత్రి 8 గంటలకు ఆశ్రమ కోనేటిలో తెప్పోత్సవం, ఆశ్రమంలో నిత్య అన్నదాన కార్యక్రమం, సంస్కృతిక కార్యక్ర మాలు జరుగుతాయని ఏవో తెలిపారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి స్వామికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దంపతులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు.

బియ్యం రవాణా నియంత్రణకు
కావలిలో చెక్‌పోస్ట్

● జేసీ కార్తీక్

కావలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు కావలిలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణ అధ్యక్షతన ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఉదయం రెవెన్యూ, పోలీస్, సివిల్‌సప్లయ్, రవాణాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై ముసునూరు టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి అక్కడ రెవెన్యూ, సివిల్‌సప్లయ్ ఉద్యోగులు 24/7 విధులు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కావలి డీఎస్పీ పీ.శ్రీధర్, తహసీల్దార్ పీ.శ్రావణ్‌కుమార్, సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేడు 'అమ్మభాషకు' వందనం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి) : తెలుగు భాషోద్యమం సందర్భంగా పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన మందిరంలో ఆదివారం ఉదయం 10 గంటలకు అమ్మభాషకు వందనం అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నెల్లూరు రచయితల సంఘం అధ్యక్షుడు ఏ.జయప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తోమాటి సంజీవరావు రచించిన విశిష్ట తెలుగు దర్శనం పుస్తకావిష్కరణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కవులు, తెలుగుభాషాభిమానులు పాల్గొని నేటి తెలుగు భాషపై తమ అభిప్రాయాలు, కవితలు, పద్యాల రూపంలో తెలియజేయవచ్చునని తెలిపారు.

నేడు వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

నెల్లూరు (సిటీ) : ఏసీనగర్‌లో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి వారి దేవస్థానంలో ఆదివారం 18వ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ శనివారం తెలిపింది. ఉదయం 4గంటలకు ధుని పూజతో ఉత్సవాలు మొదలై 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు అభిషేకం, నిత్యపూ జలు, స్వామి వారి భిక్షాటన అన్నదానం జరగనుంది.

వామ్మో.. నకిలీ నోటు!



కురగాయల వ్యాపారికి ఇచ్చిన రూ. 200 నకిలీ నోటు

ఆత్మకూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పట్ట ణంలో శనివారం నకిలీ నోటు కలకలం సృష్టిం చింది. వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు కూర గాయల మార్కెట్‌లో ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. ఈక్రమం లో ఓ గుర్తుతెలియని వ్యక్తి కూరగాయలకు వచ్చి రూ. 200 నోటు ఇచ్చి కూరగాయలు తీసుకెళ్లాడు. ఆ తరువాత వ్యాపారి ఆ నోటు పరిశీలించగా దొంగ నోటుగా తేలింది. దీంతో మార్కెట్‌లో కలకలం రేగింది. ఈసందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాపారస్తులు అప్రమత్తంగా లేకపోతే నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపాడు..



కనువిందు చేస్తున్న వినాయకులు

రూ.వెయ్యి నుంచి రూ.3లక్షల వరకు ధరలు

'చవితి'కి
గణనాథుల సిద్ధం







మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో ముస్తాబైన మహాగణపతి



ఈ నెల 27న వినాయ చవితి సందర్భం గా చూడముచ్చటైన గణనాథులు సిద్ధమవుతున్నారు. వివిధ రకాల ఆకృతులతో ప్రతిమలను చూడ ముచ్చటగా రూపుదిద్దుతున్నారు. కళ్లకు ఇంపైన రంగులు అద్ది అమ్మకాలకు సిద్ధం చేస్తున్నారు. నగరంలోని పొదలకూరు రోడ్డు, మినీబైపాస్ రోడ్డు, ట్రంకురోడ్డు, అయ్యప్పగుడి, వేదాయపాళెం పడుగుపాడులతోపాటు కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు, కోవూరు తదితర ప్రాంతాల్లో సిద్ధం చేసిన గణపతులను అమ్మకాలకు పెట్టారు. ప్రజల అవసరాలకు కావాల్సినన్ని గణపతుల ప్రతిమలను బయటి ప్రాంతాల నుంచి నెల్లూరుకు తెప్పిస్తున్నారు. రూ.వెయ్యి నుంచి రూ.3లక్షల వరకు ధరల్లో లభిస్తున్నాయి. అలాగే, తమ ఇష్టదేవుడ్ని కొలువుదీర్చి పూజలు చేసేందుకు యువత, కాలనీవాసులు వివిధ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికై స్వచ్ఛందంగా చందాలు సేకరించారు. వీధులు, కాలనీలు, ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి, మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలను అమర్చుతున్నారు. నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో వెలిసి వున్న మహాగణపతికి చవితి వేడుకలకు ముస్తాబు చేశారు. అందమైన రంగులతో స్వామి కళకళలాడుతున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)





ఇళ్ల అద్దెకు ఆధార్ తప్పనిసరి : ఆర్డీవో


మాట్లాడుతున్న ఆర్డీవో పావని

ఏఎస్‌పేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ యాత్రా స్థలమైన ఏఎస్‌పేటలో రూములు, ఇళ్ల అద్దెకు ఇచ్చేటప్పుడు అద్దెకు వచ్చేవారి ఆధార్‌కార్డులు, పూర్తి వివరాలు తీసుకోవాలని ఆర్డీవో పావని సూచించారు. శనివారం ఆమె ఆత్మకూరు డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డితో కలసి స్థానిక కామక్షి కల్యాణ మండపంలో బాడుగ రూములు, ఇళ్ల యాజమనులు, కేర్‌టేకర్లతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయబ్ రసూల్ దర్గా ఉండడంతో దేశ నలుమూలల నుంచి భక్తులు ఇక్కడికి విచ్చేస్తుంటారని, అందువల్ల రూములు, ఇళ్ల అద్దెకు ఇచ్చే సమయంలో కుటుంబంలోని అందరి గురించి పూర్తి వివరాలు సేకరించాలన్నారు. గెస్ట్‌హౌస్‌లు, లాడ్జిలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మానసిక వికలాంగులను చూసుకునే కేర్‌టేకర్లు వారి వద్ద ఉంటున్న మానసిక వికలాంగులు, వారి కుటుంబ సభ్యుల వివరాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ వేమారెడ్డి, ఎస్‌ఐ సైదులు, తహసీల్దారు అనిల్‌కుమార్, ఎంపిడివో ప్రసన్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి మహిళా ఫుట్‌బాల్ పోటీల ప్రారంభం


పోటీలో తలపడుతున్న క్రీడాకారిణిలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సీనియర్ క్రీడాకారుడు, బరోడా బ్యాంక్ రిటైర్డ్ జీఎం అనిల్ కుమార్ ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తొలిరోజు జరిగిన పోటీల్లో అనంతపురం జట్టు కడప జట్టుపై 2-1 గోల్స్, ఎన్‌టీఆర్ జిల్లా ఏఎస్‌ఆర్ జిల్లాపై 5-0 గోల్స్‌తో, నెల్లూరు జట్టు ఎన్‌టీఆర్ జట్టుపై 2-0 గోల్స్‌తో, అనంతపురం జట్టు పల్నాడు జట్టుపై 10-0 గోల్స్‌తో, నెల్లూరు జట్టు ఏఎస్‌ఆర్ జట్టుపై 5-0 గోల్స్‌తో, కడప జట్టు పల్నాడు జట్టుపై 7-0 గోల్స్‌తో విజయం సాధించాయి. ఆదివారం ఉదయం సెమీఫైనల్స్, మధ్యాహ్నం ఫైనల్స్ జరుగుతాయని అసోసియేషన్ కార్యదర్శి బీ.చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కోచ్‌లు, రిఫరీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో
వసూళ్ల పర్వం

● తాజాగా ఘటన వెలుగులోకి... ● డ్రైవర్‌ను సస్పెండ్ చేసిన డీఎంహెచ్‌వో

● పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యం


జీజీహెచ్‌లోని తల్లి,బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తాజాగా తల్లి,బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఓ డ్రైవర్ వసూళ్లకు పాల్పడిన వైనం వెలుగు చూసింది. మర్రిపాడు మండలం అనంతపురం గ్రామానికి చెందిన ఓ గర్భిణీ నెల్లూరుకు వచ్చి జీజీహెచ్‌లోని ప్రసూతి విభాగంలో ఇటీవల ఆడపిల్లకు జన్మనిచ్చింది. ప్రసవానంతరం ఆమె ఈనెల 22న తన బిడ్డతో సొంత గ్రామానికి తిరుగు ప్రయాణం అయింది. ప్రభుత్వం ఉచితంగా ఆ బాలింతరాలిని స్వగ్రామానికి చేర్చేందుకు తల్లి,బిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులో ఉంచింది. కాగా ఆ బాలింత గ్రామానికి చేరుకోగా డ్రైవర్ తనకు రూ. 2,500 ఇవ్వాలని కోరాడు. ప్రభుత్వం ఉచితంగా వాహన సదుపాయం ఏర్పాటు చేస్తే, ఎందుకు డబ్బులు అడుగుతున్నావని బాలింత కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. అయితే తమకు నెల వారీ వేతనాలు చాలా తక్కువని, అందుకే ఇలా వసూళ్లకు పాల్పడుతున్నామని డ్రైవర్ శ్రీను చెప్పాడు. చేసేది లేక ఆ నిరుపేద బాలింత డ్రైవర్ అడిగినంత ఇచ్చింది. ఈ సంఘటన వైరల్ కావటంతో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత విచారణ జరిపి డ్రైవర్ శ్రీనును వెంటనే సస్పెండ్ చేసింది.

● కొరవడిన పర్యవేక్షణ

కాగా తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. డీఎంహెచ్‌వో పర్యవేక్షణలోనే ఈ వాహన సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అరబిందో సంస్థ కాంట్రాక్టు నిర్వహణలో ఈ వాహనాలు నడుస్తున్నాయి. అయితే ఆ వాహనాలు ఎక్కడికి వెళుతున్నాయి.. ఎవరెవరిని తీసుకువెళ తున్నాయి. ఏ గ్రామానికి తీసుకువెళుతున్నాయి... వంటి పర్యవేక్షణను అధికారులు మరిచిపోయారు. దీంతో తాజాగా నెల్లూరు జీజీహెచ్‌లో వసూళ్ల పర్వం వెలుగు చూసింది. ఇక్కడ నుంచి ప్రతిరోజు 6 నుంచి ఏడుగురు బాలింతలు తమ స్వగ్రామాలకు వెళ తుంటారు. అయితే స్వచ్ఛందంగా తాము ఇచ్చే రూ. 100, రూ. 200 మాత్రమే తీసుకోవాలని బాధితులు చెబుతున్నా, లేదు..లేదు... తాము అడిగినంత చెల్లించాలని కొందరు డ్రైవర్లు అక్రమార్జనకు పాల్పడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వాసు పత్రులకు ఎక్కువగా ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు చెందిన నిరుపేదలే వస్తుంటారు. ఇలాంటి వారి నుంచి అక్రమార్జనకు పాల్పడటం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యానికి గండి పడుతున్నదని వారు పేర్కొన్నారు.

వెంటనే డ్రైవర్‌ను తొలగించాం



తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ద్వారా అక్రమార్జనకు పాల్పడిన డ్రైవర్‌ను విచారించి, వెంటనే తొలగించాం. బాలింతల నుంచి ఎవరూ కూడా డబ్బులు వసూలు చేయరాదు. అలా చేస్తే చర్యలు తప్పవు. జిల్లాలో ప్రస్తుతం 19 తల్లి,బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. వాటి ద్వారా బాలింతలను ఉచితంగా స్వగ్రామాలకు చేర్చుతున్నాం.

- డీఎంహెచ్ డాక్టర్ సుజాత

ఎస్సీ యువతకు
డ్రైవింగ్‌లో శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులకు ఏపీఎస్‌ఆర్టీసీ డ్రైవర్ల శిక్షణ పాఠశాలలో హెచ్‌ఎంవీ డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఈగ మురళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందగోరే అభ్యర్థులు ఏడాది కాలపరిమితి కలిగిన ఎల్‌ఎంవీ లైసెన్సు, హెవీ డ్రైవింగ్ ఎల్‌ఎల్‌ఆర్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. కనీస వయసు 20 ఏళ్లు ఉండాల న్నారు. అభ్యర్థులు ఈనెల 27 సాయంత్రం ఐదుగంటల లోగా నెల్లూరులోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు సమర్పించాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 94924 82756 91605 51479 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు
ఉపాధ్యాయుల మహాధర్నా

నెల్లూరు(విద్య), ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి) : కేంద్ర ప్రభుత్వ మెమో నంబరు 57ను అమలు చేయాలని కోరుతూ సోమవారం విజయవాడలో ఉపాధ్యాయుల మహాధర్నా నిర్వహించనున్నట్లు టీటీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బు, మాస ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ 2003 ఉపాధ్యాయుల ఫోరం తరఫున చేపట్టే ఈ ధర్నాలో టీచర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

అక్రమ మైనింగ్, మనీస్కాంపై ప్రశ్నిస్తే
హత్యాయత్నం కేసు పెడతారా!? : కాకాణి

కావలి (టౌన్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మైనింగ్, మనీ స్కాంపై ప్రశ్నిస్తే మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డిపై హత్యాయత్నం కేసు పెడతారా!? అని మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ముసు నూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ క్యాంప్ కార్యాలయంలో ప్రతాప్‌కుమార్ రెడ్డి సతీమణి ఆదిలక్ష్మిని కాకాణి పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో కాకాణి మాట్లాడుతూ అన్నవరం క్వారీలో అక్రమ మైనింగ్ జరుగుతోందని, కావలిలో 800 కోట్ల మనీ స్కామ్ జరిగిందని మాట్లాడితే ప్రతాప్‌పై ఎమ్మెల్యే కృష్ణారెడ్డి హత్యాయత్నం కేసు పెట్టించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చేసిన తప్పులను, అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. నడిబజారులో మాజీ మంత్రి ప్రసన్న ఇంటిపై దాడి జరిగితే ఎవరు దాడి చేసేరో వారి పేర్లు కనుక్కోలేకపోయామని పోలీసులు చెప్పడం సిగ్గుచేటన్నారు.

కావలి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

కరపత్రాలు ఆవిష్కరించిన సాధన సమితి సభ్యులు


కావలిని జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జిల్లా సాధన సమితి సభ్యులు

కావలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కావలిని ప్రత్యేక జిల్లా చేయాలని కోరుతూ శనివారం స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద కావలి జిల్లా సాధన సమితి సభ్యులు కరపత్రాలను ఆవిష్కరించారు. ముందుగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాల పునర్వ్యవస్థీకరణలో నెల్లూరు జిల్లా తీవ్రంగా నష్టపోతుందని, కావలి ప్రాంతం మరింత నష్టపోతుందన్నారు. భవిష్యత్తులో ఎటువంటి పరిశ్రమలు, పోర్టులు లేని ప్రాంతంగా మిగిలి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితులలో కావలి, కందుకూరు, ఉదయగిరి, కోవూరు, ఆత్మకూరులోని ఉత్తర ప్రాంతాలను కలిపి కావలి జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు. కావలి జిల్లా చేయడానికి అవసరమైన అన్ని వసతులు, వనరులు మెండుగా ఉన్నాయన్నారు. కావలి జిల్లాగా ఏర్పడకపోతే భవిష్యత్తులో విద్యార్థులు పరిశ్రమలలో ఉద్యోగాలు పొందడానికి ఇక్కడ ఎలాంటి పరిశ్రమలు లేక నాన్‌లోకల్‌గా మిగిలి పోయి నష్టపోతారన్నారు. కావలి జిల్లాగా ఏర్పడటానికి ఇది మంచి అనుకూలమైన సమయం అని, ఈ ప్రాంత ప్రముఖులు, అన్ని వర్గాల ప్రజలు కావలి జిల్లా సాధన సమితి ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కావలి జిల్లా సాధన సమితి సభ్యులు పులి చక్రపాణి, కరువది భాస్కర్, పులి రజనీ, అక్కిలిగుంట రమేష్, గుడిపల్లి వేణు, మాకన కిషోర్, సిద్ధూ, ఐజాక్, దానియేలు పాల్గొన్నారు.

చెన్నైకి సూపర్ లగ్జరీ బస్సులు నడపాలి

ఉదయగిరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి రాత్రి సమయంలో చెన్నైకి సూపర్‌లగ్జరీ బస్సు నడపాలని జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ గడియాల్ యస్దానీ, ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్‌లు శనివారం ఓ సంయుక్త ప్రకటనలో కోరారు. ఉదయగిరి ప్రాంతం నుంచి చెన్నైకి ఉపాధి నిమిత్తం, వైద్యశాలలకు పలువురు వెళుతుంటారన్నారు. ఇప్పటికైనా డిపో అధికారులు స్పందించి చెన్నైకి సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9594
వెండి కిలో ధర	రూ. 119900
వెండి ఒక గ్రాము	రూ. 123.00

న్యూస్ బాక్స్

వీరాంజనేయస్వామికి బంగారు ఆభరణాల సమర్పణ



ఆలయ నిర్వాహకులకు బంగారు ఆభరణాలు అందచేస్తున్న దాతలు

సంగం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి చెన్నైలో స్థిరపడిన సంగంకు చెందిన దాత రూ. 6లక్షల విలువైన బంగారు ఆభరణాలు శనివారం ఆలయ నిర్వాహకులకు అందచేశారు. ఈసందర్భంగా స్వామివారికి అభిషేకాలు, పూజలు, ఆకు పూజ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి : డీఎస్పీ

ఏఎస్ పేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసే విగ్రహాలకు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లలో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ కె వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఏఎస్ పేట పోలీస్‌స్టేషన్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయక విగ్రహం ఏర్పాటుకు కమిటీ ఏర్పాటు చేసుకోవాలని, విగ్రహం ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు వారే పూర్తి బాధ్యత వహించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ వేమారెడ్డి, ఎస్‌ఐ సైదులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణపై తహసీల్దారుకు ఫిర్యాదు

దుత్తలూరు (ఉదయగిరి), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవరం పంచాయతీ తురకపల్లి గ్రామానికి చెందిన పోలు తిమ్మయ్య అనే వ్యక్తి శ్మశాన స్థలాన్ని ఆక్రమించారని శనివారం సీపీఎం నాయకులతో కలిసి గ్రామస్థులు తహసీల్దారు నైనాగరాజుకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎస్సీలకు కేటాయించిన శ్మశాన స్థలాన్ని గత ఐదు రోజుల క్రితం ఆక్రమించుకోవడంతో పాటు ఆ స్థలంలో బోరు వేశారన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు స్థలంలో వేసిన బోరును వెంటనే తొలగించాలని కోరారు. స్పందించిన తహసీల్దారు వెంటనే సిబ్బందిని పంపించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు గుజ్జుల మల్లికార్జున, వెంకటేశ్వర్లు, సింహాద్రి పాల్గొన్నారు.

మాజీ సర్పంచు కప్పా శ్రీనివాసులు మృతికి సంతాపం

ఉదయగిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగులవారిపల్లి చెరువుపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు కప్పా శ్రీనివాసులు మృతిచెందడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని వెంకటరామారావు శనివారం ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తంచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే మండలంలోని పలువురు టీడీపీ నాయకులు, శ్రేయోభిలాషులు శ్రీనివాసులు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

సిమెంట్ రోడ్డు మార్జిన్‌కు జగనన్న లేఅవుట్ రహదారి గ్రావెల్

- కాసుల కక్కుర్తితో ఓ నాయకుడి నిర్వాకం



సిమెంట్ రోడ్డు మార్జిన్‌కు వేసిన జగనన్న లేఅవుట్ రహదారి గ్రావెల్

సంగం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా కొత్తగా సిమెంట్ రోడ్డు వేస్తే రోడ్డు మార్జిన్‌కు గ్రావెల్ తోలడం సహజం. కానీ గత ప్రభుత్వంలో వేసిన ఓ లేఅవుట్ రహదారి అంచున ఉన్న గ్రావెల్ తవ్వి మార్జిన్‌కు వేశారు. ఇది సిమెంట్ రోడ్డు వేసిన ఓ అధికార పార్టీ నాయకుడి నిర్వాకం. ఈసంఘటన సంగం మండలంలోని మక్తాపురంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద సుమారు రూ. 45 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను రూ. 10 లక్షల లోపు విభజించి గ్రామ నాయకుడే పనులు చేపట్టాడు. గ్రామంలోని ఈశ్వరమ్మ రాయి సెంటర్ నుంచి గత ప్రభుత్వంలో జగనన్న లేఅవుట్‌కు వేసిన గ్రావెల్ రహదారి మీదుగా ఎస్టీ కాలనీ వరకు సిమెంట్ రోడ్డు వేశారు. అయితే రోడ్డుమార్జిన్‌కు గ్రావెల్ వేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ కాసులకు కక్కుర్తిపడి కొంతదూరం తువ్వ ఇసుక తోలారు. ఈ విషయాన్ని శుక్రవారం ఆంధ్రజ్యోతి 'ఇది సురక్షితమేనా..' అని కథనం ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించడంతో నిలిపివేశారు. అయితే సదరు నాయకుడు కాసులకు కక్కుర్తిపడి రాత్రికి రాత్రి జగనన్న లేఅవుట్‌కు వేసిన గ్రావెల్ రోడ్డులోని అంచున ఉన్న గ్రావెల్‌ను ఎక్స్‌కవేటర్‌తో తవ్వి సిమెంట్‌రోడ్డు మార్జిన్‌కు వేశారు. తెల్లారి దీన్ని చూసిన గ్రామస్థులు జగనన్న లేఅవుట్ రహదారి గ్రావెల్ తవ్వి సిమెంట్ రోడ్డు మార్జిన్‌కు వేసిన నాయకుడిపై చర్యలు తీసుకుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి



ఆత్మకూరు : టంగుటూరికి నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి



ఉదయగిరి: టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంపంతులు జయంతి వేడుకలను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, కార్యాలయ సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయంలో ఎంవీఐ రాములు టంగుటూరు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

- **సంగం:** స్థానిక తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి తహసీల్దారు సోమ్లా నాయక్, ఎంపీడీవో షాలెట్‌లు ఆయా కార్యాలయాల్లో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- **అనంతసాగరం :** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

- **మర్రిపాడు:** టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి తహసీల్దారు అనీల్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- **ఏఎస్ పేట:** టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా స్థానిక ఎంపిడివో కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో ప్రసన్న కుమారి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- **ఉదయగిరి:** టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అప్పాజీ, మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ టీ గోపికృష్ణ టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటసామయ్య, ఎస్సీ సెల్ నాయకుడు నల్లిపోగు రాజా, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

- **దుత్తలూరు:** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో టంగుటూరి ప్రకాశంపంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు నాగరాజు, అధికారులు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- **వరికుంటపాడు(ఉదయగిరి రూరల్):** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో గోపిశ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో ఖలీల్‌అహమ్మద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

- **సీతారామపురం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సాయిప్రసాదు ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి శనివారం ఘనంగా న్విహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం : ఎమ్మెల్యే కాకర్ల



ఉదయగిరిలో అధికారులు, నాయకులతో కలిసి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే వ్యాధులు దరిచేరవని, ప్రజలు, పంచాయతీ పాలకవర్గం, నాయకులు సమన్వయంతో పనిచేసి పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సినిమాహాలు వీధిలో అధికారులు, నాయకులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో కలిసి మురుగు కాలువల్లో పూడిక తీశారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వీధుల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పడవేయకుండా పంచాయతీకి ప్రజలు సహకరించాలన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఉద్దేశ్యాన్ని అధికారులు ప్రజలకు వివరించి చైతన్యపర్చాలన్నారు. మురుగు కాలువల గుండా తాగునీటి పైపులు వెళ్లకుండా చూడాలన్నారు. ఉదయగిరి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చి ప్రజల కష్టాలు తీర్చేందుకు భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రామ్మోహన్, ఎంపీడీవో అప్పాజీ, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా, టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటసామయ్య, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, బొజ్జా శ్రీనివాసులు, ఓబులరెడ్డి, నరసింహులు, సందానీ, బాబు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- **సీతారామపురం:** స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సీతారామపురం గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి రాంనాథరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి ప్రసాదు, ఎంఈవో మస్తాన్‌వలి పాల్గొన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, టీడీపీ నాయకులు బస్టాండ్ సెంటర్‌లో చీపురు పట్టి రహదారులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సాయి ప్రసాదు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పిడుగు రవీంద్ర, మాల్యాద్రి, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, జాషువా, ఇజ్రాయిల్, ఖాజా మొద్దీన్, రమణయ్య, మండల అధికారులు, ఆరోగ్య సిబ్బంది. టీడీపీ నాయకులు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాకర్లను కలిసిన టీడీపీ నేతలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను శనివారం మండల టీడీపీ నాయకులు కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. మండల కన్వీనర్ చంద్ర మదుసూనరావు ఆధ్వర్యంలో వింజమూరులోని పార్టీ కార్యాలయంలో ఇటీవల సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గుర్రం గోపితో సహా డెరెక్టర్లుగా ఎంపికైన మానం కొండలరావు, మేడిద వెంకటేశ్వర్లు కలిసి పుష్పగుచ్చాలు అందజేసి తమకు పదవీ బాధ్యతలు అప్పగించినందుకుగాను అభినందనలు తెలిపి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, వైస్ ఎంపీపీ దేవన బోయిన మధు, తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జె లక్ష్మీనారాయణ, పొద మాధవరావు ఆరికొండ వెంకటరత్నం పాల్గొన్నారు.

డీసీపల్లి వేలం కేంద్రంలో ముగిసిన పొగాకు అమ్మకాలు

మర్రిపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి వేలం కేంద్రంలో పొగాకు అమ్మకాలు శనివారంతో ముగిసినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు. చివరిరోజు రైతులు 563 బేళ్లను తీసుకొనిరాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 212 బేళ్లను కొనుగోలుచేశారు. వివిధ కారణాలతో 351 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 291 కాగా, కనిష్ఠ ధర రూ. 140 పలికిందన్నారు. రైతులు అదనంగా పండించిన పొగాకును కేంద్ర వాణిజ్యశాఖ నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు



ఉదయగిరి: ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఏడీఏ శైలజకుమారి

ఉదయగిరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు ఇన్‌చార్జి ఏడీఏ ఈ శైలజ కుమారి హెచ్చరించారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయా దుకాణాల్లో ఎరువులు, పురుగుమందుల క్రయ, విక్రయాల రిజిస్టర్లు, గోదాముల్లో నిల్వలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- **వింజమూరు:** పట్టణంలో శనివారం వ్యవసాయ శాఖ అధికారి అనీత ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా కొరత కారణంగా ఎరువుల దుకాణాల్లో స్టాక్ పాయింట్లు పరిశీలించారు. పట్టణంలోని రెండు మూడు దుకాణాలలో యూరియా తక్కువ మోతాదులో ఉందని, మిగిలిన దుకాణాలు కూడా ఎరువును తీసుకువచ్చి రైతులకు సరఫరా చేయాలని, కొరతను నివారించాలని ఆమె దుకాణదారులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఈవో శేఖర్, వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : ఎంపీడీవో



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో గోపిశ్రీనివాస్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో గోపిశ్రీనివాస్ అన్నారు. శనివారం తూర్పు బోయమడగల సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో హెచ్చరించినప్పటికీ కొంతమంది ఉద్యోగుల్లో మార్పు రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేసి వాటి స్థానంలో నూతన రికార్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఉద్యోగి మూమెంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

వెంకటాచలం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు... వెంకటాచలం గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి షేక్ నస్రూద్దీన్ ఇంటికి వెళ్లేందుకు రహదారి దాటుతుండగా ఓ వాహనం వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నస్రూద్దీన్‌కు తీవ్ర గాయాల య్యాయి. ఢీకొన్న వాహనాన్ని ఆపకుండా గూడూరు వైపు వెళ్లినట్లు స్థానికులు వెల్లడించారు. 108 వాహనంలో క్షతగాత్రుడిని నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారిపై లారీ దగ్ధం

వెంకటాచలం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలం సమీపంలోని ఆర్టీసీ జోనల్ శిక్ష ణా కళాశాల వద్ద జాతీ య రహదారిపై శనివా రం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ లారీ దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. చెన్నై వైపు ఐరన్ లోడ్‌తో వెళ్తున్న ఓ లారీని రహదారి పక్కనే నిలిపి వంట చేసుకుం టుండగా షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారి గా మంటలు చెలరే గాయి. దీంతో లారీ డ్రైవర్, క్లీనర్ లారీ నుంచి బయటకు వచ్చేసి టోల్ సిబ్బందికి సమాచారం అందించారు. మంటలు వ్యాపించడంతో లారీ క్యాబిన్ పూర్తిగా దగ్ధమైంది. టోల్ అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. ఈ సంఘటనతో ఆ మార్గంలో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ

నెల్లూరు(క్రైం) ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన నగరంలోని బీవీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమా చారం మేరకు బీవీనగర్ లో మహేష్‌కుమార్ నివాసం ఉంటున్నారు. ఆయన ఈనెల 21న కుటుంబసభ్యుతో కలిసి తిరుమలకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 11 గ్రాముల బంగారు కమ్మలు, వెండి లక్ష్మీదేవి బొమ్మను అపహరించుకు వెళ్లారు. శనివారం ఇంటికి వచ్చిన మహేష్‌కుమార్ చోరీ ఘటనపై వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్



వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు (క్రైం) ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి): ఇళ్లలో వరుస చోరీలకు పాల్పడుతూ తప్పించుకొని తిరుగు తున్న ఓ నిందితుడిని నగరంలో ని నవాబుపేట పోలీసు లు శనివారం అరెస్ట్ చేశా రు. నవాబుపేట పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ జీ. వేణుగోపాల్‌రెడ్డి నిందితుడి వివరాలను మీడి యాకు వెల్లడించారు. వెంకటేశ్వరపురం రైలువీధిలో సయ్యద్ సబ్బీర్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన ఈనెల 20న కుటుంబంతో కలిసి ఉదయగిరిలో గంధమహోత్సవానికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగుడు ఆయన ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 10 సవర్ల బంగారు ఆభరణాలు దోచుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితుడు అదే ప్రాంతానికి చెందిన అరవ సుబ్రమణ్యంగా గుర్తించారు. పరారీలో ఉన్న నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నారు. వ్యసనాలకు బానిసైన నిందితుడు చోరీలకు పాల్ప డుతున్నాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనపరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ కే. భోజ్యానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం) ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నగరంలోని విజయమహల్ గేటు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 45 నుంచి 50 ఏళ్ల లోపు వయసు కలిగి, లేత పసుపు రంగు గల ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, నలుపురంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ ఎన్. హరిచందన సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం కోసం జీజీహెచ్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

నెల్లూరు(క్రైం) ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్‌సీసీ కాలనీలోని శనివారం ఓ ఇంట్లో విద్యుత్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. డైకాస్‌రోడ్డు ఎన్‌సీసీ కాలనీలో సుధాకర్ కుటుంబం నివాసం ఉంటోంది. శనివారం సుధాకర్ కుటుంబం ఇంట్లో లేని సమ యంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో మంటలు వ్యాపించాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ.లక్షకు పైగా ఆస్తినష్టం వాటిళ్లినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

ఉదయగిరిని జిల్లా చేయాలి

ఉదయగిరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల తరబడి అభివృద్ధికి నోచుకోని మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని జిల్లా చేయాలని కోరుతూ శనివారం వైసీపీ నాయకులు తహసీల్దారు ఎల్ రామ్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు, సరిహద్దులు, పేర్ల మార్పులు, చేర్పులకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించిందన్నారు. అందులో భాగంగా ఉదయగిరిని జిల్లా చేయాలని వినతిపత్రం అందజేశామని వారు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఉదయగిరి కేంద్రంగా కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 21 మెట్ట మండలాలను కలిపి జిల్లా చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పెద్దిరెడ్డి సోమిరెడ్డి, ముట్టుకుందు తిరుపతిరెడ్డి, ఉప్పుటూరి హరి, ఈర్ల శ్రీనివాసులు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.55,54,853

- కసుమూరులో వక్ఫ్‌బోర్డు అధికారుల తీరుపై విమర్శలు

వెంకటాచలం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు మస్తాన్‌వలీ దర్గా హుండీల ద్వారా రూ.55,54,853 ఆదాయం వచ్చినట్లు వక్ఫ్ బోర్డు అధికారులు వెల్లడించారు. హుండీ లెక్కింపు నాలుగు రోజులు కొనసాగగా, కొందరు చేతివాటం ప్రదర్శించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. తొలి మూడు రోజులే దాదాపు లెక్కింపు పూర్తి కాగా నాలుగవ రోజైన శనివారం సాయంత్రం పంచనామా ప్రక్రియ పూర్తి చేశారు. ముఖ్యంగా లెక్కింపులో పాల్గొన్న వక్ఫ్‌బోర్డు అధికారులు, సిబ్బందిలో పోలీసులు కేవలం సిబ్బందిని మాత్రమే పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. అధికారులను తనిఖీ చేయకుండా బయటకు పంపించి వేశారని, లెక్కింపు సమయంలో మాటి మాటికీ అధికారులు బయటకు లోపలికి తిరుగుతూనే ఉన్నారంటూ ఆరోపించారు. మూడు రోజుల పాటు నోట్లు లెక్కించిన వక్ఫ్‌బోర్డు అధికారులు, సిబ్బంది కనీసం చిల్లర లెక్కించకుండానే తూకం ప్రకారం 800 కేజీలకు పైగా ఉన్న చిల్లరను కేవలం రూ.3,20 లక్షలు బయటివారికి ఇచ్చేశారు. ఆ చిల్లరను తీసుకునేందుకు పలువురు పోటీపడ్డారు. నోట్లు లెక్కించిన వారు చిల్లర కూడా లెక్కించి ఉంటే బాగుండేదని స్థానికులు భావిస్తున్నారు. అలా కాకుండా తూకం ప్రకారం ఇవ్వడంపై పెదవి విరుస్తున్నారు. రెండు నెలల కిందట కేవలం రెండు హుండీలను లెక్కించగా రూ.44,01,700 ఆదాయం రాగా, ఆ సమయంలో మిగిలిన 6 హుండీలను లెక్కించ కుండా వదిలేశారు. ఆ హుండీలతోపాటు రొట్టెలపండుగ ఆదాయం అంతా కలిపి రూ.55, 54,853 లక్షలు మాత్రమే రావడంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల కిందట కేవలం రెండు హుండీలకే రూ. 44 లక్షల ఆదాయం రాగా, ఇప్పుడు సుమారు 10 హుండీల వరకు లెక్కించగా రూ.55,54,853 మాత్రమే ఉండడంపై స్థానికులు బహిరం గంగా విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంపై దర్గా ఈవో షరీఫ్ మాట్లాడు తూ దర్గాలోని హుండీలను పకడ్బందీగా నిర్వ హించినట్లు చెప్పారు. ఎలాంటి లోపాలు జరగలేదని స్పష్టం చేశారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	105
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216

కోడిగుడ్ల ధర (100): 535

మాలకొండ ఆదాయం రూ.6,95,873

వలేటివారిపాలెం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొం డ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.6,95,873 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్లకు రూ.8,050, కుంకుమార్చ నకు రూ.18,520, తలనీలాలకు రూ.28 వేలు, వాహనపూజలకు రూ.2,260, ప్రత్యేకదర్శన టికెట్లకు రూ.2,01000, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ.840, రూము అద్దెలకు రూ.24,150, కవర్లు ద్వారా రూ. 9,825, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,17,055, అన్నదానం ద్వారా రూ. 1,76,173, విరాళముల ద్వారా రూ. 10 వేలు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

శివారు ప్రాంతాల్లో సమస్యల తిష్ఠ!

● మున్సిపాలిటీలో విలీనమై 15 ఏళ్లైనా ప్రగతి శూన్యం ● అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా ఉన్న గ్రామాలు ● అవస్థలు పడుతున్న ప్రజలు



కమ్మవారిపాలెంలో దుర్భరంగా ఉన్న రోడ్డు

కావలి(టౌన్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణ శివారు ప్రాంతాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. మున్సిపాలిటీలో కలసి 15 ఏళ్లు దాటినా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో మునుపటి కంటే అధ్వానంగా మారడం, అడుగడుగున ఎదురవుతోన్న సమస్యలతో ప్రజలు నానా అవస్థలు పడుతోన్నారు. ప్రధానంగా ముసునూరు బుడంగుంట, మద్దూరుపాడు, పెంకుల ప్యాక్టరీ గిరిజన కాలనీ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోక ఇక్కడి ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ముసునూరు, బుడమగుంట, మద్దూరుపాడు ప్రాంతాలు గతంలో పంచాయతీలుగా ఉండేవి. వీటిని పట్టణంలో విలీనం చేసి 15 ఏళ్లు అవుతున్నప్పటికీ అనేక సమస్యలతో పల్లెటూరి వాతావరణమే కనిపిస్తోంది. శివారు ప్రాంతాలు ఎక్కడ చూసిన బురదమయంగా ఉండే మట్టి రోడ్లు, డ్రైన్‌లు లేక మరుగుతో నిండిన రోడ్లు, అడవిని తలపించే చిల్ల చెట్లు పిచ్చిమొక్కలు, నీటి సమస్యతో ఇళ్లముందు నీటి డ్రమ్ములు దర్శనమిస్తున్నాయి. వీటితో పాటు పాములు, కుక్కలు, పందులు, దోమల బెడదతో ఆయా ప్రాంతాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

● మట్టి రోడ్లు, డ్రైన్ సమస్యలు

శివారు ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టక పోవడంతో నాలుగు చినుకులు పడితే రోడ్లన్నీ చిత్తడై గుంతలమయంగా మారి కాలు కింద పెట్టలేని పరిస్థితి. ప్రధానంగా శివారు ప్రాంతాల్లో డ్రైన్ సమస్య పట్టిపీడిస్తోంది. మట్టి రోడ్ల పరిస్థితి ఒక పక్క.. నిర్మాణమైన సీసీ రోడ్లు కూడా డ్రైన్లు లేక మరుగంతా రోడ్లపై ప్రవహించడంతో దుర్గంధం వెదజల్లుతోంది. మట్టి రోడ్లపై మరుగు దృశ్యాలు చూస్తే ఈ ప్రాంతాలు పట్టణంలోనివేనా అన్న అనుమానం కలుగకమానదు.

● వెంటాడుతున్న విద్యుత్ సమస్య

40 ఏళ్ల క్రితం నిర్మించిన శిథిలావస్థకు చేరుకున్న పాత స్తంభాలు చిన్నవి కావడం, తీగలు రోడ్లకు అడ్డంగా నివాసాలపై వాలిపోయి ప్రమాదభరితంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కిందగా ఉండి వాటిచుట్టూ మొక్కల తీగలు అల్లుకుని నిరంతరం షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం సర్వసాధరణమైపోయింది.

● మంచినీటి సమస్య..

ముసునూరు బుడమగుంటలో, ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రత అంతాఇంతా కాదు. అనేక ప్రాంతాల్లో మున్సిపాలిటీ వారు వాటర్ ట్యాంకర్లతో రెండురోజుల కొకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ రాకపోతే అంతే సంగతులు. తాగునీటికైతే ఆర్థిక స్థోమత ఉన్నా లేకపోయినా వాటర్ బబుల్స్ కొనుగోలు చేసుకోకతప్పదు. శివారు ప్రాంత ప్రజలకు ఆశలు రేపిన అమృత్ పథకం అర్ధాంతరంగా ఆగిపోవడంతో నీటి కష్టాలు తప్పడం లేదు.



ముసునూరు తూర్పువడ్డిపాలెంలో సీసీ రోడ్డుపై మురుగు



అడవిని తలపిస్తున్న ముసునూరు రైస్‌మిల్లు రోడ్డు

● పందులు, కుక్కలు, కోతులు, పాముల బెడద

శివారు ప్రాంతాలు కావడం.. చిల్లచెట్లు, పిచ్చి మొక్కలు అడవిని తలపించేవిధంగా పెరగడంతో విష కీటకాలు (పాముల) బెడద ఎక్కువగా ఉంది. కుక్కలు, కోతుల సమస్యతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుక్కలు రోడ్లపై వెళుతున్న పాదచారులు, వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. కొన్ని రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు భయపడే పరిస్థితి. బురదమయంగా ఉండే మట్టి రోడ్లు డ్రైన్లు లేక రోడ్లపై చేరే మరుగులో లార్వా ఉత్పత్తి జరిగి దోమల సమస్య తీవ్రంగా వెంటాడడమేకాక దోమ కాటుకు గురై రోగాలు, విష జ్వరాలు బారిన పడుతున్నారు. ఇంతటి దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్న ఆయా ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మహిళల ఆర్థిక స్వావలంబనకు చర్యలు

● టీ.ప్రసాదరావు, ఏపీఎం, అల్లూరు

అల్లూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా శ్రమిస్తున్నాం. మండలంలో మహిళలు తీసుకున్న పొందుపు రుణాలను వినియోగించుకోవడం, తిరిగి చెల్లించడం సజావుగా సాగుతోంది. మండలంలోని సంఘబందాల మహిళలు పొదుపు చేసే ప్రతీ రూపాయి వారి ఉన్నతికే ఉపయోగపడుతుందని ఏపీఎం టీ.ప్రసాదరావు తెలిపారు.

? మండలంలో ఎన్ని పొదుపు సంఘబంధాలు ఉన్నాయి. ఎంతమంది సభ్యులు ఉన్నారు.

! మండలంలో 38 సంఘబంధాలు ఉండగా వాటిల్లో 1218 పొందుపు గ్రూపులు ఉన్నాయి. ఈ గ్రూపుల్లో మొత్తం 12,864 మంది సభ్యులు మండల సంఘమిత్రగా ఏర్పడి ఉన్నారు.

? పొదుపు గ్రూపులకు ఈ ఏడాది బ్యాంకర్లు ఎంత రుణం మంజూరు చేశారు.

! ఇప్పటి వరకు రూ.10.56 కోట్ల రుణాలు మంజూరు చేయించి ఉన్నాము. ఈ ఏడాది ప్రభుత్వం మైక్రో క్రెడిట్ ప్లాన్ అనే నూతన పద్ధతిని తీసుకొచ్చి బయోమెట్రిక్ ద్వారా ముందుగా గ్రూపు వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచి వాటిని సీసీలతోపాటు మేము కూడా ధ్రువీకరించి బ్యాంకర్లకు పంపితేనే రుణం మంజూరు జరుగుతుంది.

? రికవరీ ఎలా ఉంది. స్త్రీనిధి రికవరీలో సమస్యలు ఉన్నాయా.

! పొదుపు గ్రూపుల రుణాల రికవరీ 99 శాతం ఉంది. దీనిలో ఎలాంటి ఇబ్బందులు లేవు. స్త్రీ నిధి రుణాలు మాత్రం గతంలో రికవరీ మందకొడిగా ఉండేది. కానీ ప్రస్తుతం రూ.78 లక్షలకు గాను రూ.56 లక్షలు రికవరీ చేశాం. త్వరలో నూరు శాతం రికవరీకి కృషి చేస్తాం.

న్యూస్ బాక్స్

రేపటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

అల్లూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను మండలంలో ఈనెల 25వ తేదీ నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ రేషన్ కార్డులను ఈనెల 25 నుంచి 31 వరకు సంబంధిత సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి వారి ఐరిష్, ఫేస్ రీడర్, ఓటీపీ ద్వారా ధ్రువీకరించి కార్డు అందజేస్తారన్నారు. మిగిలిన కార్డులను సెప్టెంబరు 1 నుంచి 15 తేదీ వరకు సంబంధిత రేషన్ షాపు డీలర్లు వద్ద పొందవచ్చన్నారు. ఇంకా మిగిలి ఉంటే అటువంటి వారికి సెప్టెంబరు 16 నుంచి 20వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. ఈ విషయంపై ఏమైనా సందేహాలు ఉంటే గ్రామ రెవెన్యూ అధికారి, రేషన్ డీలర్లను సంప్రదించాలని కోరారు.

డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ

కందుకూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన ఎపిట్ పరిశోధన ప్రయోగశాల, అట్లైన్ స్మార్ట్‌ల ఆధ్వర్యంలో స్మార్ట్ డ్రోన్స్ అభివృద్ధిపై నిర్వహించిన ఆరురోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఆయా సంస్థల నిపుణులు కె.ప్రశాంత్, డి.విలియమ్, ఎండీ మహమ్మద్ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులకు డ్రోన్ రూపకల్పన, వస్తు అంతర్జాలం అన్వయాలు, కృత్రిమ మేథ వినియోగంపై శిక్షణనివ్వగా ఈసీఈ విద్యార్థులు ఎంతో నైపుణ్యం ప్రదర్శించటం హర్షనీయమని పేర్కొన్నారు. కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, హెచ్‌ఓడీ జీ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ అంతరిక్ష దినోత్సవం

కావలి(టౌన్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : స్థానిక విట్స్ కళాశాలలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవం ముగిసింది. ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐఐఎస్సీ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ ఐవీ మురళీకృష్ణ పాల్గొని మాట్లాడుతూ పోస్టర్ ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ అబ్బురపరిచిందన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ విజయ్‌కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించగా విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

లింగసముద్రం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని లింగసముద్రం ఎస్ఐ ఎం.నారాయణ చెప్పారు. శనివారం మండలంలోని తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో ఆయన సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, గంజాయి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ మహ్మద్ హఫ్తార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే ఎల్సీగేట్-144 తాత్కాలిక మూత పొడిగింపు

బిట్రగుంట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బోగోలు రైల్వే ఎల్సీగేట్-144 ట్రాక్‌వర్కులో భాగంగా ఈ నెల 24 వరకు తాత్కాలికంగా మూసి వేసిన గేటును మరో ఐదు రోజులు పొడిగించినట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు.

ఏఐ-సైబర్ సెక్యూరిటీపై ప్రత్యేక సదస్సు

బిట్రగుంట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో ఆధునిక రక్షణ సాంకేతికాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సైబర్ సెక్యూరిటీపై శనివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నావల్ వెటరన్, చీఫ్ స్ట్రాటజిక్ డిఫెన్స్ అడ్వైజర్ కమాండర్ వైవీవీ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే.రాజారెడ్డి, ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి, ఏవో రమ ణారెడ్డి అని విభాగాల అధిపతులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

నేడు రాములోరి తిరుణాళ్ల

కావలిరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంగయ్యగారిపాలెంలో ఆదివారం రాములవారి తిరుణాళ్ల నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పచ్చ తోరణాలతో అలంకరించారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు ఈ పూజా కార్యక్రమాలల్లో అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● స్వచ్ఛభారత్ ర్యాలీలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



స్వచ్ఛభారత్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. శనివారం జలదంకి హైస్కూల్ విద్యార్థులు, అధికారులతో కలసి స్వచ్ఛభారత్-స్వచ్ఛదివస్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. హైస్కూల్ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండు మీదుగా గ్రామ పరువీధుల్లో కొనసాగింది. ఈ ర్యాలీలో ఉపసర్పంచు కూరపాటి మాలకొండారెడ్డి, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆయన వెంట తెలుగుయువత మండల అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, గట్టుపల్లి టీడీపీ నేత కొల్లా కృష్ణ తదితరులు ఉన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి నివాళి

మండలంలోని కర్కోలువారిపాలెంకు చెందిన యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మాగంటి మాధవరావు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం గ్రామానికి వెళ్లి మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేకు సన్మానం

జలదంకి పీఏసీఎస్ చైర్మన్ కరియావుల అప్పలయ్యనాయుడు, సభ్యులు జానీ, మధుసూదనరెడ్డిలు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను వింజమూరులోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాణిక్యరావు శతజయంతి ఉత్సవాల ప్రారంభం



మాట్లాడుతున్న గుంటూరు ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్

కావలి(టౌన్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : ఎయిడెడ్ ఉద్యోగుల పాలిట దైవం మాణిక్యరావు అని గుంటూరు ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోజెస్ పేర్కొన్నారు. జేబీ డిగ్రీ కళాశాలలోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో జేబీ అధ్యాపక సంఘం, ఎంజేఎం మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మాణిక్యరావు శతజయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జేబీ అధ్యాపక సంఘం అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ రెడ్డి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గుంటూరు ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోజెస్, మాణిక్యరావు కుమారుడు డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ముందుగా విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దొడ్ల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంజె మాణిక్యరావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాణిక్యరావు జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీ విజేతలకు బహుతులు అందించారు. ఈ కార్యక్రమంలో జేబీ కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి, జేబీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు, విశ్రాంత అధ్యాపకుడు చెంచయ్య పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



కావలి : రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కావలిరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కృత్రిమ కొరత సృష్టించి ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వింజమూరు ఏడీఏ శేషగిరి పేర్కొన్నారు. పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ, విజలెన్స్ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. రికార్డులు, ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి లలిత, విజలెన్స్ అధికారులు శ్రీహరి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఉలవపాడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉలవపాడు, కరేడు, భీమవరం గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను కావలి ఏడీఏ నాగరాజు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులకు సంబంధించి ఆయా కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్స్ అధికార పత్రాలు (ఓ-ఫారమ్) లేకుండా అక్రమంగా అమ్ముతున్న రూ.2,30,000 విలువ కలిగిన ఎరువుల అమ్మకాలు నిలిపేశారు. ఏడీఏ మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు సరైన పత్రాలు కలిగి ఉండాలని, నిర్ణయించిన ధరకు మించి విక్రయించకూడదన్నారు. నిబంధనలు అత్రికమించిన వ్యాపారులపై 6ఏ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రస్తుతం సీజ్ చేసిన ఎరువులకు సంబంధించిన సరైన పత్రాలు వారంలో సమర్పించాలని, లేని పక్షంలో లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ఏడీఏ వెంట ఉలవపాడు, కందుకూరు ఏవోలు విజయ్‌కుమార్, అబ్దుల్ రహీమ్, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కలిగిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువులు, పురుగమందులు రైతులకు విక్రయించకుండా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి షేక్.జహీర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. అదేవిధంగా నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను మాత్రమే రైతులకు విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వింజమూరు వ్యవసాయ అధికారి వాసు. సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ తిరుణాళ్ల ప్రారంభం



బండలాగుతున్న ఎడ్లు

బిట్రగుంట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండ లం ముంగమూరు పంచాయతీ పేటలోని పోలేరమ్మ తిరునాళ్లు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజాభిషేకాల్లో భక్తులు పాలొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఎడ్ల బండ లాగు పోటీ లను ముంగమూరు చెరువు నీటి సంఘం అధ్యక్షుడు యన్నాబత్తిన వెంకటే శ్వర్లు ప్రారంభించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 9 జట్లు పోటాపోటీగా బండ లాగి బలప్రదర్శన చేశాయి. బాపట్ల జిల్లా చుం దూరుకు చెందిన రాములమ్మ ఎడ్లు మొదటి స్థానంలో నిలిచి రూ.70 వేల, సూర్యాపేటకు చెందిన సురేంద్ర రెడ్డి ఎడ్లు రెండో స్థానంలో నిలిచి రూ.60 వేల, మైదుకూరుకు చెందిన వెంకటేశ్వర్లు ఎడ్లు మూడో స్థానంలో రూ. 50 వేల గెలుపొందాయి. గ్రామ పెద్దలు నగదు బహుమ తి ప్రదానం చేశారు.

ఆంధ్రకేసరి టంగుటూరికి ఘన నివాళి



కందుకూరులో ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సబ్‌కలెక్టరు హిమవంశీ

కందుకూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రథమ ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి సందర్భంగా శనివారం కందుకూరులో ఘన నివాళులర్పిం చారు. ఆంధ్రకేసరి సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న ప్రకాశం పంతులు కాంశ్యవిగ్రహం వద్ద సబ్ కలెక్టరు దామెర హిమవంశీ, డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులు గా పాల్గొని విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రకేసరి సేవాసమితి ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్‌లో శనివారం మూడుపూటలా పేదలకు ఉచిత ఆహారం ఏర్పాటు చేశారు. ఆంధ్రకేసరి సేవాసమితి అధ్యక్షుడు మంచిరాజు మురళి అ ధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇప్పగుంట నాగరాజారావు, ఐవీ సుబ్రహ్మణ్యం, నారాయణం రాధాకృష్ణమాచార్యులు, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్, టీడీపీ నాయకుడు దామా మల్లేశ్వరరావు, బీజేపీ నాయకుడు గట్టుమనేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

● ప్రకాశం పంతులు జయంతి

కావలి(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు శనివారం కావలిలో నిర్వహించారు, కావలి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణ ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించగా ఆర్డీవో కార్యాల య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో పాతూరులోని శ్రీచైతన్య విద్యాసంస్థ లో ప్రకాశం పంతులు జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. పలువురు నాయకులు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణసంఘాల నేతలు కళాధరరావు, పీ.ప్రసాద్, గంగుల చంద్రశేఖర్, నందనవనం మధు, ప్రకాష్‌రావు, రాజేంద్ర కుమార్, పట్టణ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

షార్టు సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

లింగసముద్రం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం పంచాయతీ జంపాలవారిపాలెం పాముల కాలనీఇ చెందిన గురునాధం యేసుకు చెందిన పూరిల్లు శుక్రవారం రాత్రి విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ఘటనలో పర్నీచర్, నిత్యావసరాలు, సామగ్రి కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న ఆర్ఐ ఎం రమణయ్య, వీఆర్వో మౌనికలు శనివారం గ్రామానికి వెళ్లి కాలిన ఇంటిని పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి వారికి నివేదిక అందజేస్తామన్నారు. బాధితునికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

టిప్పరు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

అల్లూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): టిప్పరు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన అల్లూరులో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు, బాధితుల వివరాల మేరకు.. ఈపూరి నాగరాజు వాటర్ ట్యాంక్ సెంటర్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా మట్టి లోడ్‌తో కావలి నుంచి నెల్లూరు వైపుకు వెళ్తున్న టిప్పరు వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ఘటనతో తీవ్ర రక్తగాయాలైన నాగరాజును చికిత్స నిమిత్తం అల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. మట్టి తో ఆ మార్గంలో వెళ్తున్న మూడు టిప్పర్లను అదుపు లోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

అనుమతి లేని లేఅవుట్లపై చర్యలు తీసుకుంటాం



ఏపీమోడల్ స్కూల్ ఎదురుగా లేఅవుట్‌ను పరిశీలిస్తున్న మధు

కలిగిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో అనధికారికంగా వేస్తున్న లే అవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎంపీడీవో వెలుగోటి మధు పేర్కొన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయం ఎదురుగా అనుమతులు లేకుండా లేఅవుట్లను ఏర్పాటు చేసి అమ్మకాలు సాగించడం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై శనివారం లేఅవుట్‌ను పరిశీలించారు. నుడా ముసుగులో తమకు అనుమతులున్నాయంటూ ఎటువంటి ఫోన్ నెంబరు లేకుండా డెవలపర్స్ పేర్లతో సోషల్ మీడియా ద్వారా బ్రోచర్లను వైరల్ చేస్తూ అమ్మకాలు సాగిస్తే సహించేది లేదన్నారు. పంచాయతీ అనుమతులతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకొని ఉన్న లేఅవుట్‌లలో ప్లాట్లను మాత్ర మే కొనుగోలు చేయాలని ప్రజలకు సూచించారు.

అపెస్సా జిల్లా కార్యదర్శిగా రమేష్‌సింగ్ ఎన్నిక



కావలి ఏఎస్‌వో రమేష్‌సింగ్

కావలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ సబార్డినేషన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా కావలి ఏఎస్‌వో రమేష్ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక శనివారం నెల్లూరులో జరిగింది. ఆ ఎన్నికలలో జిల్లా కార్యదర్శిగా రమేష్‌సింగ్‌ను ఎంపిక చేయడంతో కావలిలో పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. రమేష్ సింగ్ గతంలో రెండు పర్యాయాలు వింజమూరు ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు.

గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

కావలి రూరల్/జలదంకి/లింగసముద్రం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితికి గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాల ఏర్పాటుకు పోలీస్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కావలిరూరల్ సీఐ రాజేశ్వరరావు, జలదంకి ఎస్ఐ సయ్యద్ లతీఫున్నీసా, లింగసముద్రం ఎస్ఐ ఎం.నారాయణలు తెలిపారు. శనివారం వారు ఆయా పోలీసు స్టేషన్లలో మాట్లాడుతూ మండపాల రక్షణ వినాయక విగ్రహ కమిటీ సభ్యులదేనని, పోలీస్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, తరువాత వచ్చే క్యూఆర్‌కోడ్ ప్రింట్‌ను మండపం వద్ద అంటించాలన్నారు. క్యూఆర్‌కోడ్ వచ్చిన అనంతరం పోలీసులను సంప్రదించి మండపం కమిటీ సభ్యుల వివరాలు అందజేసి అనుమతి పొందాలన్నారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. విగ్రహాల ఊరేగింపులో లౌడ్ స్పీకర్లు పెట్టవద్దని, బాణాసంచా పేల్చరాదన్నారు.

డీఎస్సీలో మెరిసిన ఆణిముత్యాలు




రాయి సాయికోటి


మైలారి శ్రీకాంత్

● రెండు విభాగాల్లో ఇద్దరికి రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకులు

చిట్టమూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఫలితాల్లో జిల్లాకు చెందిన అభ్యర్థులు మెరిశారు. ఒక్కొక్కరు నాలుగైదు పోస్టులకూ ఎంపికయ్యారు. రెండు విభాగాల్లో.. ఇద్దరు రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకులు సాధించారు. ఆ ఇద్దరూ చిట్టమూరు మండలానికి చెందిన వారే కావడం గమనార్హం. కోగిలి గొల్లపాలెంకు చెందిన రాయి సాయికోటి యాదవ్ ఎస్ఏ పీఈటీ విభాగంలో 93 మార్కులతో.. ఎల్లసిరి దళితవాడకు చెందిన మైలారి శ్రీకాంత్ ఎస్ఏ తెలుగులో 91 మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. వీరిలో సాయికోటి తల్లిదండ్రులు కృష్ణయ్య, సుజాత వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు. పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివారు. ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లాలని లక్ష్యం పెట్టుకుని కష్టపడి చదివారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయగానే.. తన లక్ష్యాన్ని చేరుకున్నారు.

● ఇక, మైలారి పెంచలయ్య, రత్నమ్మ దంపతుల కుమారుడు శ్రీకాంత్ కూడా వసతి గృహంలో ఉండి.. ప్రభుత్వ పాఠశాలలో చదివారు. ఉపాధ్యాయ వృత్తి సాధించాలనే సంకల్పంతో తల్లిదండ్రుల కష్టం తెలిసిన తనయుడుగా బాగా చదివారు. డిగ్రీ వరకు మంచి మార్కులు సాధించారు. డీఎస్సీలో ఎస్ఏ తెలుగు విభాగంలో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకుతో తన కల నెరవేర్చుకున్నారు.

ఒకేసారి ఐదు టీచర్ పోస్టులకు..

● ప్రతిభ చాటిన వ్యవసాయ కూలీ బిడ్డ


శేషాద్రికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం రావడమే గగనమవుతున్న రోజుల్లో ఆ వ్యవసాయ కూలీ బిడ్డ ఏకంగా ఐదు విభాగాల్లో పోస్టులు సాధించారు. విశేష ప్రతిభాపాటవాలతో పోటీ అభ్యర్థులకు స్ఫూర్తిని, కుటుంబసభ్యుల్లో ఆనందాన్ని నింపారు శేషాద్రి. ఎర్రావారిపాలెం మండలం ఎల్లమంద పరిధిలోని ఓఎస్ గొల్లపల్లెకు చెందిన ముంద్రే చిన్న వెంకటరమణ, రమణమ్మ దంపతులు ఉన్న కొద్ది పాటి పొలం సాగుతో పాటు వ్యసాయ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కుమారుడు శేషాద్రిని కష్టపడి చదివించారు. తల్లిదండ్రుల శ్రమకు తగినట్లుగా అతడూ కష్టపడి చదివారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ- 2025 పరీక్షలకు అకుంఠిత దీక్షతో సిద్ధమయ్యారు. తాజాగా ప్రకటించిన ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో 80.63 మార్కులతో 9వ ర్యాంకు, 86.33 మార్కులతో సెకండరీ గ్రేడ్ విభాగంలో 53వ ర్యాంకు, టీజీటీ- ట్రైనీ గ్రాడ్యుయేట్ టీచరు (తెలుగు)లో 127వ ర్యాంక్, టీజీటీ (సోషల్)లో 82వ ర్యాంక్, ఎస్ఏ(తెలుగు)లో 42వ ర్యాంక్‌లు సాధించాడు. ఒకే పర్యాయం ఐదు విభాగాల్లో ర్యాంకులు సాధించి పోస్టులకు ఎంపిక కావడంతో శేషాద్రి కుటుంబంలో ఆనందానికి హద్దు లేకుండా పోయింది.

● ఇదే మండలంలోని బొగ్గలవారిపల్లెకు చెందిన కామసాని శ్యామల రెడ్డెప్పరెడ్డిల కుమారుడు శివకుమార్‌రెడ్డి కూడా ఎస్ఏ స్పెషల్ విభాగంలో 128వ ర్యాంక్, ఎస్‌జీటీలో 270వ ర్యాంక్ సాధించడం విశేషం.

డీఎస్సీలో మూడు పోస్టులకు అర్హత


సాయినాథ్, వనజ

కోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలో ఇద్దరు డీఎస్సీ అభ్యర్థులు మూడు పోస్టులకు అర్హత సాధించారు. తిమ్మానాయుడుపాళెం గ్రామానికి చెందిన కావలి నరసయ్య, రమణమ్మ దంపతుల కుమారుడు సాయినాథ్ నెల్లూరు జిల్లాస్థాయిలో స్కూల్ అసిస్టెంట్(సోషల్) 23వ ర్యాంక్ సాధించారు. అదే విధంగా టీజీటీ జోన్ 3లో (సోషల్) 59వ ర్యాంక్, పీజీటీ(గురుకులంలో సోషల్) జోన్-3లో 22వ ర్యాంక్ సాధించాడు. ● చిట్టేడుకు చెందిన వెంకటరమణయ్య, సునీత దంపతులు కుమార్తె వనజ డీఎస్సీలో మూడు పోస్టులకు అర్హత సాధించింది. ఎస్‌జీటీలో జిల్లాస్థాయిలో 3వ ర్యాంకు, గణితంలో స్కూల్ అసిస్టెంట్ 16వ ర్యాంకు, టీజీటీలో 57వ ర్యాంకు సాధించారు.

సరస్వతీ పుత్రుడు మోహన్

● మెగా డీఎస్సీలో నాలుగు పోస్టులకు అర్హత
● అంతకుముందు కానిస్టేబుల్ పరీక్షలో మూడో ర్యాంకు

తిరుపతి(విద్య), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల ప్రాయంలోనే తండ్రిని పోగొట్టుకున్నాడు. ఉపాధి నిమిత్తం తల్లి కువైట్‌కు వెళ్లారు. అమ్మమ్మ ఇంటి వద్దే పెరిగాడు. తాజాగా మెగా డీఎస్సీలో ఆ కుర్రాడు విశేష ప్రతిభ చాటి నాలుగు పోస్టులకు అర్హత సాధించాడు. పుత్తూరుకు చెందిన గజేంద్ర, రత్న దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో మోహన్ చిన్నవారు. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుసాగింది. దూర విద్యావిధానంలో బీఏ, బీఈడీ పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ, కానిస్టేబుల్ పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వడంతో పట్టుదలతో సిద్ధమయ్యారు. తాజా ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 23, తెలుగు విభాగంలో 27, ఎస్టీటీలో 26, టీజీటీ(సోషల్)లో 35వ ర్యాంకులను పొందారు. అంతేకాదు ఇటీవల పోలీస్ కాస్టేబుల్ ఫలితాల్లో ఏకంగా జిల్లాలో 3వ ర్యాంకు సాధించాడీ ప్రతిభావంతుడు. తమ వద్ద శిక్షణ పొందిన మోహన్‌ను హేమశ్రీ డీఎస్సీ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ శ్రీనివాసులు అభినందించారు.


మోహన్‌ను అభినందిస్తున్న శ్రీనివాసులు

ఐఐటీ వద్ద స్పేస్ సిటీ

● 15 ఎకరాలు గుర్తించిన అధికారులు

తిరుపతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఏరో స్పేస్ సిటీ ఏర్పేడు సమీపంలో రూపుదిద్దుకోనుంది. శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన షార్‌కీ, శ్రీసిటీ సెజ్‌కీ సమీపంలో ఉండేలా ఐఐటీ వద్ద 15 ఎకరాల భూమిని అధికారులు ఇందుకోసం గుర్తించారు. డీఆర్‌డీవో మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారు అయిన డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ఇందుకు సంబంధించిన పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఇటీవల ఆయన జిల్లా అధికారులతో సమావేశం అయ్యారు. ఆయన సూచన మేరకే ఐఐటీ వద్ద భూములను జిల్లా కలెక్టర్ గుర్తించారు. త్వరలోనే దాన్ని డీఆర్‌డీవోకు అప్పగించనున్నారు. డీఆర్‌డీవోకి అనుబంధంగా ఏర్పాటు కానున్న స్పేస్ సిటీలో పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయి. ఉత్పత్తి కార్యకలాపాలన్నీ షార్ సమీపంలో జరుగుతాయని తెలుస్తోంది.

అవిలాలలో పర్యాటక శాఖకు పది ఎకరాలు

ఇక తిరుపతి రూరల్ మండలం అవిలాల రెవిన్యూ గ్రామ పరిధిలో అత్యంత విలువైన పది ఎకరాల భూమిని జిల్లా యంత్రాంగం పర్యాటక శాఖకు కేటాయించింది. డీకేటీ పట్టాల పేరిట ఇతరుల అనుభవంలో ఉన్న ఈ భూములను స్వాధీనం చేసుకుని ఏపీ టూరిజం అథారిటీకి అప్పగించింది. పర్యాటక శాఖ ఆ భూమిని అభివృద్ధి చేసి ఆతిధ్య రంగానికి సంబంధించి ఫైవ్ స్టార్ లగ్జరీ హోటల్ లేదా రిసార్టులకు కేటాయించనుంది. అలాగే దామినీడు పరిధిలో స్వాధీనం చేసుకున్న భూముల్లో 28 ఎకరాలను పర్యాటక శాఖకు, 34 ఎకరాలను స్పోర్ట్స్ కాంప్లెక్సు నిర్మాణానికి, 14 ఎకరాలను జిల్లా కోర్టు భవనాల సముదాయానికి కేటాయించారు. పర్యాటక శాఖకు కేటాయించిన భూముల్లో రెండు ఫైవ్ స్టార్ హోటళ్ళు రానున్నాయి.

సెమీ కండక్టర్ పరిశ్రమ మనకేనా?

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన సెమీ కండక్టర్ పరిశ్రమకు తిరుపతి జిల్లానే అనువైనదని భావిస్తున్నట్టు తెలిసింది. కొప్పర్తి, ఓర్వకల్లు, తిరుపతిలలో ఒక చోట దీనిని ఏర్పాటు చేయాలనుకుంటున్నారు. అయితే ఎలక్ట్రానిక్ మానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు, సంబంధిత పరిశ్రమలున్న తిరుపతి జిల్లానే ఎక్కువ అనువైనదని అంటున్నారు. తిరుపతి జిల్లాకు చెన్నై, బెంగుళూరు నగరాలు చేరువగా వుండడం కూడా అనుకూలాంశం. తిరుపతి జిల్లాను ఎంపిక చేస్తే అప్పగించడానికి వీలుగా వడమాలపేట మండలం ఎస్వీపురం వద్ద 600 ఎకరాల భూమిని జిల్లా యంత్రాంగం గుర్తించినట్టు తెలిసింది. జిల్లాకు ఈ యూనిట్ వస్తే యువతకు ఉపాధి అవకాశాలు సైతం గణనీయంగా మెరుగుపడతాయి. జిల్లా యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తోంది.

స్మార్ట్‌గా.. రేషన్ కార్డులు

● జిల్లాలో రేపటి నుంచి 6,36,196 కార్డుల పంపిణీ



స్మార్ట్ రేషన్ కార్డు

రేషన్ కార్డు స్మార్టుగా మారింది. ఏటీఎం సైజ్‌కు తగ్గింది. జేబులోను, పర్సులోను దీనిని పెట్టుకొని వెళ్లొచ్చు. గుర్తింపు కార్డు కింద వాడుకోవచ్చు. ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత తీసుకురావడంలో భాగంగా కూటమి ప్రభుత్వం ఈ స్మార్టు కార్డులు తీసుకొచ్చింది. సోమవారం నుంచి వీటి పంపిణీకి చర్యలు చేపట్టింది. జిల్లాకు కొత్తగా 44,937 రేషన్ కార్డులు మంజూరు చేసింది. ఇప్పటికే దాదాపు 5,91,259 బియ్యం కార్డులున్నాయి. ఈ మొత్తం కలుపుకుని 6,36,196 స్మార్ట్ కార్డులను సోమవారం నుంచి పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. మొదటి రోజు ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. ఇకపై ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్ కార్డు మాత్రమే ప్రామాణికంగా వుండనుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా వివాహమైన దంపతులు, కుటుంబాల నుంచి విడిపోయిన వారికి మళ్లీ కార్డులు తీసుకోవడానికి అవకాశం లేకుండా ఐదేళ్ల పాటు ఆందోళన చెందారు. వాటి నుంచి కూటమి ప్రభుత్వం విముక్తి కలిగించింది. దీనికోసం ఈ ఏడాది మే 7 నుంచి అన్ని సచివాలయాల్లో దరఖాస్తులను స్వీకరించింది. ఇందులో దాదాపు 63,589 మంది దరఖాస్తు చేయగా వివిధ ప్రాతిపదికన పరిశీలించి ఇప్పటి వరకు 44,937 మందిని అర్హులుగా గుర్తించి వారికి మాత్రం ఇప్పుడు కొత్తగా కార్డులు పంపిణీ చేయనున్నారు.

స్మార్టు కార్డు ఇలా.. : స్మార్టు కార్డులో నేతల ఫొటోలు ఉండవు. కార్డుకు ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, కుటుంబ పెద్ద ఫొటో, ఆ రేషన్ కార్డు నెంబరు, రేషన్ షాపు ఐడీ నెంబరు తదితర వివరాలతో పాటు క్యూఆర్ కోడ్ ఉంటుంది. కార్డు వెనుకవైపున లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలు ఉంటాయి. ఈ కార్డుపైనున్న క్యూఆర్ కోడ్‌ను, డీలర్ల వద్దనున్న ఈ పోస్ యంత్రంతో స్కాన్ చేస్తే లబ్ధిదారుల వివరాలు డిస్‌ప్లే అవుతాయి. రేషన్ సరుకుల వినియోగ సమాచారమూ కనిపిస్తుంది. ఇలా సరికొత్త టెక్నాలజీతో స్మార్టు కార్డును ప్రభుత్వం తీసుకొచ్చింది.

ఇది నిరంతర ప్రక్రియ

ఇప్పుడు కార్డుల కోసం దరఖాస్తు చేసి రాని వారు, కొత్తగా కార్డులు కావాలని దరఖాస్తు చేసుకోవాలన్నా ఇది నిరంతర ప్రక్రియనే. వాట్సాప్ నెంబరు 95523 00009 నెంబరులో బియ్యం కార్డులు సరెండర్, చేర్పులు, తొలగింపులు, తప్పులు సరిచేయడం, నూతన కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చును. వివాహ ధ్రువీకరణ పత్రం, పెళ్లి ఫొటో కూడా అవసరం లేదు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దరఖాస్తు చేసిన 21 రోజుల్లో రేషన్ కార్డు అందుతుంది.

- శేషాచలం రాజు, డీఎస్‌వో


కుప్పం వైపు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

వి.కోటకు చేరుకున్న నీళ్లు

వి.కోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పలమనేరు నియోజక వర్గం వి.కోటకు శనివారం హంద్రీ-నీవా జలాలు చేరుకున్నాయి. ఉదయాన్నే బైరెడ్డిపల్లె మండలం నుంచి కృష్ణాజలాలు తోటకనుమ మీదుగా గ్రావిటీ ద్వారా దానమయ్యగారిపల్లె వద్దకు చేరుకున్నాయి. మధ్యాహ్నం కృష్ణాపురం వద్దనున్న పంప్ హౌస్‌కు జలాలు రావడంతో పెద్ద ఎత్తున జనం అక్కడకు చేరుకున్నారు. మధ్యాహ్నం పంప్ హౌస్‌లో మిషన్లకు హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు, టీడీపీ నేతలు, కూటమి నాయకులు పూజలు చేశారు. పంప్ హౌస్ మోటార్ల స్విచ్ ఆన్ చేసి నీరు పంపింగ్ చేశారు. కాసేపటికే నీరు రెండు వైపుల నుంచి బయటకు రావడంతో ఒక్కసారిగా రైతులు, పార్టీ నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు కృతనిశ్చయంతో 600 కిలోమీటర్లు మేర కాలువ నిర్మాణం పూర్తి చేసి కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా 700 అడుగుల ఎత్తుకు నీటిని తరలించడం చారిత్రాత్మకం అన్నారు. సాయంత్రానికి వి.కోట - కుప్పం మార్గంలోని దాసార్లపల్లె వద్ద జాతీయ రహదారిని దాటి కృష్ణా జలాలు కుప్పం వైపు పరవళ్లు తొక్కాయి. రాత్రికి పెద్దబరిణేపల్లె పంచాయతీ ఆదినేపల్లె వద్దనున్న మరో పంప్ హౌస్‌కు నీరు చేరుకోనున్నాయి. అక్కడ నీటిని పంప్ చేస్తే కుప్పం సెగ్మెంట్ పరిధిలోని రామకుప్పం మండలంలోకి అడుగెడుతాయి. ఇందుకుగాను హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు కాలువ వెంబడి రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు.

30న సీఎం చంద్రబాబు జలహారతి

కుప్పం, ఆంధ్రజ్యోతి: కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువుకు ఆదివారం రాత్రికి కృష్ణా జలాలు చేరవచ్చని అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. ఈ చెరువు వద్ద సీఎం చంద్రబాబు నాయుడు 30వ తేదీన హంద్రీ-నీవా కాలువకు జలహారతి ఇవ్వనున్నారు. నంద్యాల జిల్లా మాల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద జూలై 17న కృష్ణా జలాలను చంద్రబాబు హంద్రీ-నీవా కాలువకు విడుదల చేసిన విషయం తెలిసిందే. శనివారం నాటికి వి.కోట మండల పరిధిలోకి వచ్చేశాయి. ప్రస్తుతం కాల్వలో 80 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఇదే వేగంతో సాగితే ఆదివారం రాత్రికల్లా కుప్పం మండలంలోకి వస్తాయి.

బాలునాయక్ ఆస్తులు భారీనే!

● రెండు రోజులపాటు ఏసీబీ సోదాలు
● కార్మిక శాఖ జాయింట్ కమిషనరు అరెస్టు



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు కార్మికశాఖ జాయింట్ కమిషనరు బాలు నాయక్ ఆస్తులు భారీగానే ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించి శనివారం ఆయన్ను అరెస్టు చేశారు. బాలు నాయక్‌పై కొంతకాలంగా ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు వెళుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారంటూ ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో శుక్ర, శనివారాల్లో తిరుపతి ప్రాంతీయ అవినీతి నిరోధక శాఖ అదనపు ఎస్పీ విమలకుమారి నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. కర్నూలులోని కార్మిక శాఖ కార్యాలయంతో పాటు అద్దె ఇల్లు, తిరుపతిలో రెండు చోట్ల, అన్నమయ్య జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో.. ఇలా మూడు జిల్లాల పరిధిలో 11 చోట్ల ఏకకాలంలో సోదాలు జరిగాయి. తిరుపతి నగరం రాఘవేంద్ర నగర్‌లో దాదాపు మూడు అంతస్తుల ఇల్లు, కుమారుడి పేరిట సర్జికల్ దుకాణం ఉంది. రేణిగుంట మండలం గాజులమండ్యంలో ఇంటి ప్లాటు ఉన్నట్లు రికార్డుల ద్వారా ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇక కర్నూలులో భార్య పేరు మీద ప్లాటు, వ్యవసాయ భూములు ఉన్నాయని గుర్తించినట్ల తెలిసింది. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లిలో బాలు నాయక్ కుటుంబ సభ్యుల పేర్లమీద 10 ఎకరాల పొలాలు ఉన్నట్లు తనిఖీల్లో వెలుగు చూసినట్లు సమాచారం. సంబేపల్లిలో ఒక పౌల్ట్రీ ఫారం ఉంది. తిరుపతిలో ఇంటి స్థలం ఉన్నట్లు గుర్తించారు. ఇవన్నీ డాక్యుమెంట్ విలువ ప్రకారం రూ.ఐదారు కోట్లు ఉంటుందని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. మార్కెట్ విలువ ప్రకారం రూ.50 కోట్లు ఉండొచ్చని అంచనా. వీటితో పాటు పలు చోట్ల బినామీ పేర్ల మీద ఆస్తులు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇక, అర కిలో బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు లాకర్లను పరిశీలించేందుకు మేనేజర్లకు లేఖలు రాశారు. శనివారం బాలు నాయక్‌ను అరెస్టు చేసి నెల్లూరులోని ఏసీబీ కోర్టుకు తరలించారు.

వైకల్యాన్ని ఓడించాడు
● ఒంటిచేతితో రాణిస్తున్న అన్వేష్
● క్రీడల్లో స్ఫూర్తిదాయక విజయ ప్రస్థానం
4

లాటరీ నిర్వహించని దుకాణాల దరఖాస్తు రుసుం వాపస్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు రాకుంటే వాటికి లాటరీ నిర్వహించేది లేదని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. అటువంటి బార్లకు సంబంధించి దరఖాస్తు రుసుంను వెనక్కి ఇచ్చేస్తామని తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-28 సంవత్సరాలకు సంబంధించి కొత్త బార్ పాలసీ ప్రకటించిన తరుణంలో జిల్లా వ్యాప్తంగా 29 బార్లు, గీతకులాల కోసం ప్రత్యేకంగా మరో మూడు బార్లు కేటాయిస్తున్నారన్నారు. ప్రతి దరఖాస్తుకు రూ 5 లక్షలు దరఖాస్తు రుసుం, ప్రాసెసింగ్ ఫీజు కింద అదనంగా రూ 10,000 సమర్పించాలన్నారు. ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు అందితేనే లాటరీ తీస్తామన్నారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ సంజయ్ కరోల్

తిరుమల, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో జస్టిస్‌కు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

సూర్యఘర్ లబ్ధిదారులను ప్రోత్సహించండి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలో ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం లబ్ధిదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారిని ప్రోత్సహించాలని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోష రావు రెవెన్యూ ఉద్యోగులను ఆదేశించారు. సదరన్ డిస్కం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం డిస్కంలోని 9 జిల్లాల రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకం వల్ల సంస్థపై విద్యుత్ కొనుగోలు భారం తగ్గుతుందన్నారు. సూర్యఘర్ పథకం వినియోగదారుల సర్వీసులకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రాయితీ వినియోగదారులకు ఉపయోగపడుతోందని, సంస్థకు విద్యుత్ చౌకగా లభిస్తోందని తెలిపారు. తొమ్మిది జిల్లాల్లో విద్యుత్ సర్వీసులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యుత్ బకాయిలు 100 శాతం వసూలు చేయాలన్నారు. మొండి బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. అంతకు ముందు సంస్థ రెవెన్యూ విభాగం చీఫ్ జనరల్ మేనేజరు కె.ఆర్.ఎస్.ధర్మజ్ఞాని విద్యుత్ రెవెన్యూ వసూలు అంశాలపై సమీక్ష చేశారు. 9 జిల్లాల ఎస్ఏవోలు, ఏవోలు, ఏఏవోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.75 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,067

తలనీలాలు సమర్పించినవారు: 25,212



ఆదివారం ప్రత్యేకం

వైకల్యాన్ని ఓడించాడు

ఒంటిచేతితో రాణిస్తున్న అన్వేష్

క్రీడల్లో స్ఫూర్తిదాయక విజయ ప్రస్థానం

కొందరు చిన్న కష్టం ఎదురైతేనే నిరాశ చెందుతారు. జీవితాన్నే కోల్పోయినట్లు భావిస్తారు. కానీ అన్వేష్ అలా కాదు. ప్రమాదవశాత్తూ ఒక చెయ్యి పోయినా ఆత్మవిశ్వాసాన్ని వీడలేదు. వైకల్యంగా భావించలేదు. తనలోని క్రీడా సంకల్పాన్ని చెక్కు చెదరనివ్వలేదు. ఒంటిచేత్తోనే బతుకుబండి నడుపుతున్నాడు. మరోపక్క తాను ప్రాణానికి ప్రాణంగా భావించే క్రీడల్లోనూ రాణిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాడు. నిరంతర సాధనతో సాధ్యం కానిదేదీ లేదంటూ నిరూపిస్తూ స్ఫూర్తిని చాటుతున్నాడు అన్వేష్.

- గూడూరు, ఆంధ్రజ్యోతి





గూడూరు పట్టణంలోని కోనేటిమిట్టకు చెందిన మరియమ్మ, కృష్ణయ్య దంపతుల కుమారుడు అన్వేష్ పురుషోత్తమ్. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబ నేపథ్యం. చదువుతో పాటు క్రీడలంటే కూడా ఇష్టం. వాకాడు గురుకుల పాఠశాలలో చదువుతున్నప్పుడు సాఫ్ట్‌బాల్, రెజ్లింగ్, షాట్ పుట్, వాలీబాల్‌లలో శిక్షణ పొందాడు. విశేష ప్రతిభ కనబరిచాడు. జిల్లా, రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచాడు. నెల్లూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చదివాక గూడూరులోని ఓ పరిశ్రమలో చిరుద్యోగంలో చేరాడు. 2011లో పెళ్లయిన అన్వేష్‌కు పాప, బాబు ఉన్నారు. 2014లో దురదృష్టం వెంటాడింది. పరిశ్రమలో జరిగిన ఓ సంఘటన అన్వేష్‌ను అంగవికలుడ్ని చేసింది. కుడి చేయిని కోల్పోయాడు. రెండేళ్లపాటు ఆటుపోట్లు ఎదుర్కొన్నాడు. కొద్దిగా కోలుకున్నాక మనసు మళ్లీ క్రీడలమీదకు మళ్లింది. ఇందుకోసం ఒంటిచేతితోనే కఠోర సాధన చేశాడు. క్రీడా నైపుణ్యానికి పదునుపెట్టాడు. షటిల్, షాట్ పుట్, క్రికెట్ వంటి క్రీడలతో పాటు పలు అథ్లెటిక్స్ ఆడటంలో సఫలీకృతుడయ్యాడు. నైరాశ్యాన్ని తరిమేసి దివ్యాంగుల క్రీడాపోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టాడు. జాతీయ స్థాయిలో పారా అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటి ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసుకున్నాడు. అంతర్జాతీయ పారా క్రికెట్ క్రీడల పోటీల్లో మన దేశం తరఫున ప్రాతినిధ్యం వహించి సత్తా చాటాడు.



బంగ్లాదేశ్‌లో జరిగిన పోటీలలో ప్రతిభాపురస్కారాన్ని అందుకుంటున్న అన్వేష్

సాధించిన విజయాల్లో కొన్ని..

● 2020లో విశాఖపట్నం 2021లో అనంతపురం, 2022లో కాకినాడ, 2023లో విశాఖపట్నంలలో జరిగిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల పోటీల్లో స్వర్ణ, రజత పతకాలు సాధించాడు. 2021లో తిరుపతిలో జరిగిన జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ● 2023లో భారత్-బంగ్లాదేశ్ టీ-20 పోటీల్లో జట్టులో కీలక పాత్ర పోషించాడు. ఫలితంగా దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ బోర్డులో సభ్యత్వం సాధించాడు. అదేఏడాది బెంగళూరు అంతర్జాతీయ పోటీల్లో పలు పతకాలను గెల్చుకున్నాడు. కోయంబత్తూరు ఐపీసీఎల్ క్రికెట్ పోటీల్లో జట్టు విజయానికి దోహదపడ్డాడు. నేపాల్‌తో జరిగిన టీ-20, వన్‌డే సిరీస్‌ల్లో భారత్ విజయం వెనుక బలమైన పాత్ర పోషించాడు. అన్వేష్ సాధించిన క్రీడా విజయాలకు ప్రోత్సాహకరంగా పలు పురస్కారాలను అందుకున్నాడు.

చేయూత ఇవ్వండి..

పోటీలకు వెళ్లాలని ఉత్సాహమున్నా ఆర్థిక స్తోమత ప్రతిబంధకమవుతోంది. సొంతంగా నిధులు సమకూర్చుకోవడం కష్టంగా ఉంటోంది. అంతర్జాతీయస్థాయి పోటీలకు వెళ్లాలంటే ఖర్చు చాలానే అవుతుంది. దాతలు లేదా ప్రభుత్వం కాస్త ప్రోత్సాహాన్ని అందిస్తే మరిన్ని విజయాలను సాధిస్తా.

- అన్వేష్ పురుషోత్తమ్

'మఠం' భవనాన్ని పూర్తిగా కూల్చం

● దెబ్బతిన్న చోటే పునర్నిర్మాణం ● ఐఐటీ నివేదికను అనుసరిస్తాం ● మరోసారి సమావేశమై తుదినిర్ణయం ● భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్, కమిషనర్



మఠం భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

తిరుపతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హాథీరాంజీ మఠం భవనాన్ని పూర్తిగా కూల్చబోమని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టంచేశారు. కుంగిన, పగుళ్ల వచ్చిన ప్రాంతాల్లో మాత్రమే కూల్చడమా? లేదా రెట్రోఫిటింగ్ రీకన్‌స్ట్రక్షన్ చేయడమా? అనేది మరో నాలుగురోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఐఐటీ నివేదిక ఆధారంగా ప్రజలకు ప్రాణనష్టం కలగకుండా చర్యలు చేపడతామన్నారు. తిరుపతి గాంధీరోడ్డులోని హాథీరాంజీ మఠం భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్యతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'హాథీరాంజీ మఠానికి 125ఏళ్ల చరిత్ర ఉంది. కాలక్రమంలో ఇక్కడ దేవదాయశాఖ ఆర్జేసీ కార్యాలయం, మఠం పరిపాలన, సుమారు 60 షాపులకుపైగా అద్దెకు ఇచ్చారు. నిర్వహణ సరిగాలేక భవనం శిథిలావస్థకు చేరింది. ఏడేళ్లుగా కార్పొరేషన్‌కు తరచూ ఫిర్యాదులు వచ్చాయి. దురదృష్టవశాత్తు ఏదైనా జరిగితే ప్రాణనష్టం కలిగే అవకాశం ఉండటంత మఠం వాళ్లు దేవదాయశాఖకు లేఖ రాశారు. ఐఐటీ నిపుణులు భవనాన్ని పరిశీలించారు. పగుళ్లు, కుంగిపోయిన ప్రదేశాలను చూసి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని వారు నివేదకలో స్పష్టంగా తేల్చారు. హాథీరాంజీ మఠం భవనాన్ని పూర్తిగా కూల్చివేస్తామన్నది అపోహమాత్రమే. మఠానికి తూర్పు, ఉత్తరం, దక్షిణ ప్రాంతాల్లో కొన్నిచోట్ల పగుళ్లు, కుంగిపోవడం వల్ల భవనం శిథిలావస్థకు చేరింది. ఎవరికీ ప్రాణం నష్టం జరగకూడదనేదే ప్రభుత్వం ఉద్దేశం. ఈ మఠం బంజారా కమిటీకి సెంటిమెంటుతో కూడినదని వారి మనోభావాలను దెబ్బతీసే అవకాశం ఉండదు' అని తెలిపారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా.ఇక్కడి వారికి ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అందులో భాగంగానే ఇక్కడ పరిస్థితులను పరిశీలించామన్నారు.భవనాన్ని పూర్తిగా కూల్చి వేస్తామని మీడియాలో వస్తున్న ప్రచారం అబద్ధమన్నారు. ఐఐటీ నిపుణుల నివేదిక మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, హస్తకళల చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, మఠం ఏవో బాపిరెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, ఏపీ యూఐడీసీ డైరెక్టర్ ఊకా విజయ కుమార్, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర కూటమినేతలు బిఎల్ సంజయ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, శ్రీధర్ వర్మ, పుష్పావతి, ఆముదాల తులసీరాం, రాజా రెడ్డి, వినోద్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

మఠం భవనం కూల్చొద్దు

● హాథీరాంజీ మఠంలో బంజారా సాధువులు, భక్తుల నిరసన



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): హాథీరాంజీ మఠం భవనాన్ని కూల్చొద్దంటూ బంజరా మహంతు, హాథీరామ్ బాబాజీ మహాసంఘ్ సభ్యులు శనివారం నిరసనకు దిగారు. మఠం భవనాల పరిశీలనకు ఎమ్మెల్యే శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ వస్తున్నారనే సమచారంతో వీరంతా ఇక్కడికి చేరుకున్నారు. వెంకటేశ్వరస్వామి పరమభక్తుడు హాథీరాంజీ జ్ఞాపకాలకు గుర్తు ఈ మఠం భవనమని పేర్కొన్నారు. పురాతన ఈ కట్టడాన్ని పరిరక్షించి భావితరాలకు అందించాలని కోరారు. కూల్చాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఆ సంఘ సభ్యులతో కలెక్టర్ చర్చించారు. మఠం జ్ఞాపకాలను చెరపడం లేదని, అనుకోని ప్రమాదం సంభవిస్తే ఎలాంటి నష్టం కలగకూడదనే ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు.

స్విమ్స్ వర్సిటీ పీజీ కోర్సుల అడ్మిషన్ల గడువు పొడిగింపు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలో ఈ విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల అడ్మిషన్ల గడువు సెప్టెంబరు 5 వరకు పొడిగిస్తున్నట్లు రిజిస్ట్రారు అపర్ణ బిట్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ నర్సింగ్, ఎంపీటీ, ఎంఎస్సీ అలైడ్ హెల్త్‌సైన్సెస్, ఎంఎస్సీ క్లీనికల్ వైరాలజీ, ఎంఎస్సీ క్లీనికల్ సైకాలజీ వంటి పీజీ కోర్సులతోపాటు స్పెషలైజేడ్ నర్సింగ్ కోర్సులకు ఈనెల 1న నోటిఫికేషన్ విడుదల చేశారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె సూచించారు.

నేడు ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్ష

- హాజరు కానున్న 1,450 మంది అభ్యర్థులు -



మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీపీఎస్సీ కంప్యూటర్ డిపార్ట్‌మెంటల్ పరీక్ష(గ్రామ సర్వేయర్లు)కు ఏర్పాట్లు చేసినట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయని, 1,450మంది అభ్యర్థులు హాజరవుతారని వెల్లడించారు. మొత్తం మూడు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజగోపాల్, జగదీష్, యోగేష్ పాల్గొన్నారు.

కర్ణాటక జంట ఆత్మహత్య



వెంకటరాజు, అనుష మృతదేహాలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం వడ్డగిరికి చెందిన జంట తిరుపతిలోని ఒక లాడ్జిలో శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి వివరాల మేరకు.. వడ్డగిరికి చెందిన వెంకటరాజు(34), అనుష(25) ఇంటి నుంచి పారిపోయి శుక్రవారం తిరుపతికి వచ్చారు. శ్రీవారి దర్శనానికి వచ్చినట్లు చెప్పి స్థానిక శివకృష్ణ లాడ్జిలో రూము అద్దెకు తీసుకున్నారు. రెండు రోజులుగా వారు బయటకు రాక పోవడంతో అనుమానం వచ్చి గది తాళాలు పగులకొట్టి చూశారు. ఇద్దరూ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించారు. వెంటనే లాడ్జి మేనేజర్ ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హేమాద్రి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. మృతికి గల కారణాలు తెలియలేదని, బెంగళూరులోని చామరాజుపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదై ఉందని చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆ అరగంటలోనే నగలు ఎత్తుకెళ్లారు

● 80 గ్రాముల ఆభరణాల చోరీపై కేసు నమోదు



చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి బాధితురాలితో మాట్లాడుతున్న డీఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇంట్లోని టీవీ వెనుక కప్‌బోర్డులో 80 గ్రాముల బంగారు నగలు ఉంచారు. 20వ తేది చూస్తే ఉన్నాయి. శుక్రవారం ఉదయం చూస్తే లేవు. 20వ తేదీన మధ్యాహ్నం షాపునకు వెళ్లొచ్చిన అరగంట వ్యవధిలోనే దొంగతనం చేసుంటారని భావించారు. దీనిపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. దుర్గసముద్రంలో పత్తి మునెమ్మ, రామచంద్రయ్య దంపతులు ఉంటున్నారు. ఈ నెల 20న మధ్యాహ్నం 3 గంటలకు రామచంద్రయ్య తన అక్క ఇంటికి వెళ్లారు. 3.30 గంటల సమయంలో మునెమ్మ ఆకు వక్క తీసుకురావడానికి ఇంటికి తాళమేసి, తలుపు పక్కన బ్యాగులో ఆ తాళాలు ఉంచి వెళ్లారు. అరగంట తర్వాత ఆమె తిరిగొచ్చారు. తలుపునకు తాళం వేసుండటంతో ఎలాంటి అనుమానం రాలేదు. శుక్రవారం ఉదయం చూడగా టీవీ వెనుక ఉంచిన దాదాపు 80 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఇళ్లంతా వెదికారు. ఎక్కడా కనిపించక పోవడంతో శనివారం రూరల్ సీఐ చిన్నగోవిందును కలసి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ షేక్‌షావలి కేసు నమోదు చేశారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ ప్రసాద్, సీఐ చిన్నగోవిందు, ఎస్ఐ షేక్ షావలి, పోలీసులు, డాగ్, వేలి ముద్రలు నిపుణులు పరిశీలించారు. ఇప్పటికే అవసరమైన సాక్ష్యాధారాలు సేకరించిన పోలీసులకు కేసులో కొన్ని ఆధారాలు లభించినట్లు తెలిసింది.

ఎరువుల దుకాణాలపై విజిలెన్సు దాడులు

● 577 యూరియా బస్తాల సీజ్



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎరువుల దుకాణాలపై శనివారం విజిలెన్సు దాడులు చేపట్టారు. రైతులకు అందాల్సిన ఎరువులు పక్కదారి పడుతున్న వైనంపై తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదేశాల మేరకు డీఎస్పీ మల్లికార్జునరావు నేతృత్వంలో సీఐలు వెంకటరవి, చంద్రశేఖర నాయక్, విజిలెన్సు ఏవో రామాంజనేయులు, సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు. గూడూరులో సాయి బాలాజీ రైతు డిపోలో 577 యూరియా బస్తాలు సీజ్ చేశారు.

తిరుపతి పార్లమెంటు టీడీపీ కమిటీకి కసరత్తు

● 26న రేణిగుంట వై కన్వెన్షన్ హాలులో సమావేశం

● పరిశీలకులుగా మంత్రి సవిత సహా ఇద్దరు కార్పొరేషన్ల ఛైర్మన్లు

తిరుపతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు కమిటీ ఏర్పాటుకు ఎట్టకేలకు కసరత్తు ప్రారంభమైంది. ఈనెల 26వ తేదీన మంగళవారం తిరుపతి పార్లమెంటు కమిటీ ఏర్పాటు కోసం ప్రత్యేక సమావేశం జరగనుంది. పార్లమెంటు కమిటీ ఏర్పాటుపై చర్చించి, సమావేశం సజావుగా జరిగేలా చూసేందుకు అధిష్టానం ముగ్గురు పరిశీలకులను నియమించింది. ఆ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్‌లు పరిశీలకులుగా నియమితులయ్యారు. 26న రేణిగుంటలోని వై కన్వెన్షన్ హాలులో ఉదయం 10 నుంచీ సాయంత్రం 5 వరకూ సమావేశం జరగనుంది. దీనికి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మొదలుకుని జాతీయ, రాష్ట్ర కమిటీలలోని ప్రతినిధులు, రాష్ట్ర అనుబంధ కమిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ప్రస్తుత జిల్లా కమిటీ, జిల్లా అనుబంధ కమిటీల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఎమ్మెల్యేలు, ఇంఛార్జులు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేషన్ల ఛైర్‌పర్సన్లు, డైరెక్టర్లు, నామినేటెడ్ పదవుల్లో వున్న వారు... ఇలా సుమారు 200 మంది దాకా ప్రతినిధులు హాజరు కానున్నారు. పరిశీలకుల ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో పార్లమెంటు కమిటీలోని 34 పదవులకు, అలాగే రాష్ట్ర కమిటీకి ఆయా నియోజకవర్గాల నుంచీ ఆశావహుల జాబితాలను ఎమ్మెల్యేలు, ఇంఛార్జులు పార్టీ పరిశీలకులకు అందజేయనున్నారు. ముఖ్యంగా పార్లమెంటు కమిటీకి సంబంధించి ప్రధాన సామాజికవర్గాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలకు తగిన ప్రాతినిధ్యం వుండేలా, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకూ ప్రాతినిధ్యం వుండేలా జాగ్రత్త వహించనున్నారు. పార్లమెంటు, రాష్ట్ర కమిటీలలో వివిధ పదవులను ఆశిస్తున్న వారి జాబితాలను, ఎమ్మెల్యేలు, ఇంఛార్జులు సిఫారసు చేసిన జాబితాలను పరిశీలకులు అదే రోజు సాయంత్రం అధిష్టానానికి పంపించనున్నారు. ఈ నెలాఖరులోపే పార్లమెంటు కమిటీని అధిష్టానం ప్రకటించే అవకాశముంది.

నేటి నుంచి అమరావతి చాంపియన్‌షిప్ కప్ పోటీలు

● మైదానాల్లో విస్తృత ఏర్పాట్లు



ఎస్వీయూ మైదానంలో అథ్లెటిక్స్‌కు సిద్ధమైన ట్రాక్

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అమరావతి చాంపియన్‌షిప్ కప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు జరిగే పోటీల ఏర్పాట్లను శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు పర్యవేక్షిస్తున్నారు. ఎస్వీయూ మైదానంలో అథ్లెటిక్స్, ఖోఖో, ఎస్వీయూ క్యాంపస్‌లో బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ క్యాంపస్‌స్కూల్ వద్ద వాలీబాల్, ఆర్చరీ, శ్రీనివాస క్రీడా సముదాయంలో కబడ్డీ, బ్యాడ్మింటన్, ఎస్వీఆర్ట్స్ కాలేజీ మైదానంలో హాకీ పోటీలు జరుగుతాయి. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, అధికారులు మొత్తం 1,700మంది ఆదివారం ఉదయానికి చేరుకుంటారు. ఎస్వీయూ, మహిళా వర్సిటీలలో వసతుల కు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎస్వీయూ మైదానంలో ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రవాణా, క్రీడల శాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, ౨ హాజరుకానున్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

● విద్యార్థులు సురక్షితం



పొలంలోకి దూసుకెళ్లిన దృశ్యం

చంద్రగిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పుల్లయ్యగారిపల్లె సమీపంలో స్కూల్ బస్సు అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తూ విద్యార్థులెవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. క్షేమంగా బయటపడ్డారు. శనివారం ఉదయం చంద్రగిరిలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు పుల్లయ్యగారిపల్లె నుంచి చంద్రగిరికి వస్తోంది. దారిలో ఆటో ఎదురుగా రావడంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న పొలంలోకి దూసుకెళ్లింది. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

అన్న క్యాంటీన్‌లో న్యాయమూర్తి తనిఖీలు



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న న్యాయమూర్తి విష్ణవర్మ

వెంకటగిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్ నిర్వహణను వెంకటగిరి జూనియర్ సివిజడ్జి విష్ణవర్మ శనివారం తనిఖీ చేశారు. భోజనం చేసి కూరలు అన్నీ రుచిగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే అన్నం సరిగా లేదని, బియ్యం మార్చాలని, అలాగే తాగునీటి వసతిని మెరుగుపరచాలని నిర్వాహకులకు సూచించారు. న్యాయమూర్తి వెంట న్యాయవాదులు రాజారావు, సుంకర రాజేష్, లావణ్య, కిషోర్ ఉన్నారు.

సుధాకర్‌రెడ్డి మృతి తీరనిలోటు



సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గూడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నేత సుధాకర్‌రెడ్డి మృతి వామపక్షాలకు తీరనిలోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామా నాయుడు, శివారెడ్డి అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి సుధాకర్‌రెడ్డి ఎనలేని సేవలను అందించారన్నారు. నల్గొండ నుంచి రెండు దఫాలు ఎంపీగా గెలుపొందిన ఆయన 2012 నుంచి 2019 వరకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగారన్నారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల్లో ఆయన కీలకంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, కృష్ణప్ప, సాంబశివ, మురళి, విజయభాస్కర్, సీవీఆర్‌కుమార్, రమేష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు స్థలం కేటాయింపు



మున్సిపాలిటీ కమిషనర్ చిన్నయ్యకు డంపింగ్ యార్డు పొజిషన్ సర్టిఫికెట్ అందజేస్తున్న ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్, ఎంపీడీవో

సూళ్లూరుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రజలను పట్టి పీడిస్తున్న డంపింగ్ యార్డు సమస్యలకు పరిష్కారం లభించింది. పట్టణ నడిబొడ్డున జాతీయ రహదారిపై కాళంగి నదిని ఆనుకుని డంపింగ్ యార్డు ఉంది. పట్టణంలో ఉత్పత్తి అయ్యే చెత్తంతా అక్కడే వేసేవారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను బయో మైనింగ్ ద్వారా రీసైక్లింగ్ చేస్తున్నారు. సెప్టెంబరు నెలాఖరులోగా డంపింగ్ యార్డులో చెత్తను బయో మైనింగ్ చేయనున్నారు. ఇకపై పట్టణవాసులకు ఇబ్బంది లేకుండా మండల పరిధిలోని కొణ్ణంబట్టు గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 131లో 10 ఎకరాలు డంపింగ్ యార్డుకు కేటాయించారు. శనివారం ఆర్డీవో కిరణ్మయి 10 ఎకరాల భూమిని మున్సిపల్ శాఖకు బదలాయిస్తూ కమిషనర్ చిన్నయ్యకు పొజిషన్ సర్టిఫికెట్ అందజేశారు కార్యక్రమంలో తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి, ఎంపీడీవో ఏవీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

దళితులను విభజించడం సరికాదు: చింతా



మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

నాయుడుపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను విభజించి పాలించడం సరికాదని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ అన్నారు. నాయుడుపేట గాంధీమందిరం వద్ద శనివారం ఆయన మాట్లాడారు. బ్రిటీష్ పాలన తరహా విభజించు.. పాలించు విధానం వల్ల ప్రజల్లో ఐక్యత దెబ్బతింటుందన్నారు. ఎస్సీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలన్నారు. తెలంగాణాలో అధికంగా ఉన్న మాదిగ సామాజిక వర్గాన్ని బి క్యాటగిరిలో ఉంచినట్లే, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అధికంగా ఉన్న మాల సామాజిక వర్గాన్ని బి క్యాటగిరిగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో దారా వెంకటకృష్ణయ్య, చెన్నకేశవులు, అశోక్‌కుమార్, మాధవ్, పేర్నాటి వెంకటేశ్వర్లు, శేషయ్య, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, శీనయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

వాకాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరి అని ఎస్ఐ నాగబాబు అన్నారు. గణేష్ మండపాన్ని ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు గణేష్ ఉత్సవ డాట్‌నెట్ వెబ్‌సైట్ ద్వారా అనుమతి పొందవచ్చన్నారు. తూపిలిపాళెం సముద్రతీరంలో నిమజ్జనానికి సాయంత్రం 5 గంటల వరకే అనుమతులు ఉంటాయన్నారు.

హుండీ చోరీపై ఫిర్యాదు

కోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి సంగమేశ్వర ఆలయంలో హుండీ చోరీ విషయాన్ని నిగ్గు తేల్చాలని గ్రామస్తులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంగమేశ్వరాలయంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. మే నెల మొదటి వారంలో హుండీలోని నగదు, ఆభరణాలు చోరీకి గురయ్యాయి. హుండీకి మరో తాళం వేస్తామని ఆలయ పూజారి కార్తీక్ చెప్పారని, దీనిపై తమకు అనుమానాలు ఉన్నాయని గ్రామస్తులు చెప్పారు.

ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

26 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం

మంగళం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సీకేదిన్నె మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, 26ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేశారు. కడప సబ్ కంట్రోల్ ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి బృందం శుక్రవారం సాయంత్రం నుంచి సీకే దిన్నె మండలంలోని మద్దిమడుగు ఫారెస్టు సెక్షన్‌లో స్థానిక అటవీ సిబ్బంది షకీల్ అహ్మద్, నారాయణరెడ్డితో కలిసి కూంబింగ్ చేపట్టారు. కొలుములపల్లి సమీపంలో కొంతమంది కారుతో కనిపించారు. చుట్టుముట్టేందుకు ప్రయత్నించగా కొందరు పారిపోయారు. ముగ్గురు దొరికారు. పరిసర ప్రాంతాల్లో 26 ఎర్రచందనం దుంగలు లభించాయి. స్మగ్లర్లను, ఎర్రచందనం దుంగలను, కారును తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని కీ మ్యాన్ దుర్మరణం



గురవయ్య(ఫైల్‌ఫొటో)

దొరవారిసత్రం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొనడంతో రైల్వే ఉద్యోగి దుర్మరణం చెందిన ఘటన దొరవారి సత్రం రైల్వేగేటు సమీపంలో శనివారం ఉదయం జరిగింది. ఏకొల్లు గ్రామానికి చెందిన బందిల గురవయ్య(33) రైల్వే కీ మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం 6 గంట ప్రాంతంలో పట్టాలు దాటుతుండగా న్యూఢిల్లీ నుంచి చెన్నై వెళ్లే జీటీ ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. మృత దేహం గుర్తు పట్టలేని విధంగా నలిగి పోయింది. స్థానిక రైల్వే సిబ్బంది గుర్తించి కుటుంబ సభ్యులతో పాటు, సూళ్లూరుపేట రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడుకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



నిర్మాణం పూర్తయి ప్రారంభించకపోవడంతో ఖాళీగా ఉన్న కాట్రగుంట సచివాలయ, రైతు సేవ, ఆరోగ్య కేంద్రం భవనాలు

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

బాలాయపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో వైసీపీ హయాంలో ఆర్భాటంగా ప్రారంభించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. బాలాయపల్లిలో రూ.21.8 లక్షల వ్యయంతో 2022లో ప్రారంభమైన రైతు భరోసా కేంద్రం నిర్మాణం 2023లో పూర్తి చేశారు. కానీ ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ఇదిలా ఉండగా వ్యవసాయశాఖకు సొంత భవనం లేకపోవడంతో ఆశాఖ అధికారులు వివిధ భవనాల్లో విధులు నిర్వహించుకోల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవాకేంద్రాలుగా పేరు మార్చుతూ ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మాణం పూర్తయిన భవనాన్ని ప్రారంభించి వినియోగంలోకి తీసుకుని వస్తే వ్యవసాయశాఖ అధికారులకు, రైతులకు సౌకర్యంగా ఉంటుంది. అదేవిధంగా కాట్రగుంట గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.20.80 లక్షలతో ఆరోగ్య కేంద్రం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం పనులు 2021లో ప్రారంభించి 2023లో పూర్తి చేశారు. వీటిని ప్రారంభించకపోవడంతో ఖాళీగా ఉన్నాయి. కాగా, పంచాయతీ భవనంలోని ఇరుకు గదుల్లోనే సచివాలయం, వ్యవసాయశాఖ, ఆరోగ్యశాఖ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ఖాళీగా ఉన్న భవనాలను ప్రారంభిస్తే అధికారులతో పాటు ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

చంద్రయాన్-3తో ఇనుమడించిన భారత ఖ్యాతి



నేషనల్ స్పేస్ డే కార్యక్రమంలో విద్యార్థులు

చిల్లకూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతవరం రేస్ పాఠశాలలో శనివారం నేషనల్ స్పేస్ డే నిర్వహించారు. పాఠశాల ఆవరణలో చంద్రయాన్-3 ల్యాండర్ విక్రమ్, రోవర్ ప్రగ్యాన్ నమూనాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బాలచెన్నయ్య మాట్లాడుతూ ఆర్యభట్ట ఉపగ్రహం నుంచి నేటి చంద్రయాన్-3 వరకు శ్రీహరికోటలోని షార్ నుంచి ఎన్నో ఉపగ్రహాలను ప్రయోగించడం జరిగిందన్నారు. చంద్రుని దక్షిణ ధృవంపై చంద్రయాన్-3 సురక్షితంగా ల్యాండ్ అయి భారతదేశ ఖ్యాతిని ఇనుమడింప చేసిన రోజును నేషనల్ స్పేస్ డేగా జరుపుకోవడం జరుగుతోందన్నారు.

ఓజిలి: మండలంలోని చిల్లమానుచేను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నేషనల్ స్పేస్ డే నిర్వహించారు. విద్యార్థులు స్పేస్ టెక్నాలజీపై తయారు చేసిన వివిధ మోడల్స్, చార్టులను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సునీల్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ జాతీయ అంతరిక్ష దినోత్సవం ప్రాముఖ్యం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, సల్మా తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం హైదరాబాదుకు చెందిన ఏవీకే టెక్ సొల్యూషన్ పీఎల్‌డీ కంపెనీ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరిగాయి. బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న సీఎస్‌ఈ, ఏఐడీఎస్, ఐటీ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఎంపికైన 232 మందికి రాత పరీక్ష నిర్వహించారు. ఫైనల్ రౌండ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తామని ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషోందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

పెళ్లకూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కగారిపేట వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. తొట్టంబేడు మండలం దొమ్మర పాళెంకు చెందిన అంకయ్య పెళ్లకూరు నుంచి దొమ్మరపాళెంకు ఆటో డ్రైవింగ్ చేస్తూ వెళ్తుండగా అక్కగారిపేట వద్ద రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అంకయ్యకు గాయాలయ్యాయి. అతడిని హైవే అంబులెన్స్‌లో శ్రీకాళహస్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే చర్యలు

నాయుడుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో శనివారం మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా పలు దుకాణాలను తనిఖీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేరంటాలమ్మ ఆలయంలో పూజలు



సూళ్లూరుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటపోలూరు నారాయణ పేరంటాలమ్మ ఆలయంలో 4వ వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కలశ స్థాపన చేసి గణపతి పూజ నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు చేసి పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో హోమం నిర్వహించారు. అమ్మవారు ముత్యాల చీర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కొండమరెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

సూళ్లూరుపేట, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం మాలలు ఐక్యంగా పోరాడాలని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు అన్నారు. శనివారం సూళ్లూరుపేటలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, భారత రాజ్యాంగం పరిరక్షణ కోసం మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిట్ల చిన్న, కిరణ్ కుమార్, కిషోర్, సుధాకర్, గోకుల్, సాయి, సిద్ధయ్య, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

కోటలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎల్‌పీవో, అధికారులు

కోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోటలో శనివారం డీఎల్‌పీవో వాణిరెడ్డి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో వేణు, పలు శాఖల ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ వర్కర్లు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

చిల్లకూరులో...

చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరులో శనివారం రెవెన్యూ, వైద్యశాఖ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీనివాసులు, పీహెచ్‌సీ డాక్టర్ షాలోమ్ అరాఫత్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ చేరకుండా చూడాలని, నీటి తొట్టెలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొండా రామచంద్రారెడ్డి, బెల్లకొండ రాజేంద్ర, దాసరి రాము, గోపి, ఆర్ఐ పూర్ణా, వీఆర్‌వోలు రమణయ్య, లక్ష్మీనారాయణ తదిత రులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న ట్రాక్టర్

యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం కలిపేడు గ్రామ సమీపంలో మోటారు సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ప్రవీణ్(22) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని అన్నమేడు గ్రామానికి చెందిన ప్రవీణ్ శుక్రవారం రాత్రి కలిపేడు సమీపంలో మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొంది. గాయపడిన ప్రవీణ్‌ను స్థానికులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు తీసుకెళ్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

దొరవారిసత్రం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం సూరపు అగ్రహారం అడవిలో పేకాట స్థావరంపై ఎస్ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడి చేశారు. ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4130 స్వాధీనం చేసుకొన్నారు.

గ్రావెల్ టిప్పర్ల అడ్డగింత

నాయుడుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అధిక గ్రావెల్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లను మడపలం గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. టిప్పర్లు ఆగిపోవడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు వెళ్లి మడపలం గ్రామస్తులతో మాట్లాడారు. 40 టన్నుల సామర్థ్యం ఉన్న రోడ్డుపై దాదాపు 60 టన్నుల లోడ్‌తో టిప్పర్లు వెళ్తున్నాయని, రోజూ 30 టిప్పర్లు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో ఓడ్డు దెబ్బతింటోందన్నారు. సాగరమాల రోడ్డు పనులకు గ్రావెల్ తీసుకెళ్తున్నారని రెవెన్యూ అధికారులు గ్రామస్తులకు సర్దిచెప్పారు. పోలీసులు టిప్పర్లను తరలింపో పాటు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

కోట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మహిళలను చైతన్యం చేసి బాల్య వివాహాలను నిర్మూలిద్దామని సీడీపీవో మునికుమారి పిలుపునిచ్చారు. కోటలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీ వర్కర్లతో బాల్య వివాహాల నిర్మూలనపై సమీక్ష జరిగింది. అంగన్‌వాడీ వర్కర్లు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, అందుకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు.

జేవీవీ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

గూడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంస్థ పట్టణాధక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ విద్యార్థుల్లో సైన్స్‌పట్ల అవగాహనను పెంపొందించేలా జేవీవీ సంస్థ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో చెంచునారాయణ, రామ్మోహన్, సుబ్బారావు, సుమన్‌రెడ్డి, ఇబ్రహీం, రజినీకాంత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

గూడూరు అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవాసంస్థ కార్యాలయంలో శనివారం పేదలకు దుప్పట్లు, ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రామ్మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, పెంచలయ్య, యశ్వంత్, మల్లికార్జున, నాగరాజు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

పెళ్లకూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రతకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో ప్రమీలారాణి సూచించారు. శని వారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాల గురించి సమీక్షించారు.

టంగుటూరికి నివాళి

వాకాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశంపంతులు జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీడీవో శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దారు రఫీ సయ్యద్ నివాళులర్పించారు.

భూ సమస్య పరిష్కరించండి

చిట్టమూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సోమసముద్రం గ్రామంలో శ్మశానవాటిక భూ సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామానికి చెందిన దళితులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. శ్మశానవాటిక స్థలాన్ని డీకేటీ పట్టా ఇవ్వడం తగదని అన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ సతీష్ హామీ ఇచ్చారు.

పులికాట్‌ను సందర్శించిన అటవీశాఖ శాఖ ప్రత్యేక కార్యదర్శి



అట్టకానితిప్ప వద్ద పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ కార్యదర్శి అనంతరాము, పక్కన ఆర్డీవో, డీఎఫ్‌వో

సూళ్లూరుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ, అటవీ, విజ్ఞాన సాంకేతిక శాఖ ప్రత్యేక కార్యదర్శి జి.అనంతరాము శనివారం పులికాట్ సరస్సును సందర్శించారు. ఆయనకు అటవీశాఖ అధికారులు ఘనంగా స్వాగతం పలికి పులికాట్‌లో పక్షులు, పర్యావరణ విజ్ఞాన కేంద్రం గురించి వివరించారు. అనంతరం ఆయన షార్‌ను సందర్శించారు. శ్రీహరికోటలో ఉన్న ప్రయోగ వేదికతో పాటు స్పేస్ మ్యూజియాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, డీఎఫ్‌వో హారిక, ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో రమణయ్య తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన పెంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, ఐసీడీఎస్ సిబ్బంది

గూడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థినులు అవగాహన కలిగివుండాలని సీడీపీవో మెహబూబి అన్నారు. శనివారం స్థానిక చవటపాళెంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి బాల్య వివాహాల నిర్మూలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్వరూపారాణి, కుమార్, భారతి, యశోధ, దేవసేనమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జీవో 30ను సద్వినియోగం చేసుకోండి

తడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జారీచేసిన జీవో 30ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు శరత్‌బాబు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ అనధికార లేఅవుట్‌లు, అక్రమ నిర్మాణాలు అభ్యంతరాలులేని ప్రభుత్వ స్థలాలలో ఇళ్లు నిర్మించుకున్న వారు వాటిని క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. జీవో ప్రకారం 300 చదరపు గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారని, ఆపై నిర్మాణాలకు ప్రభుత్వం సూచించిన ప్రకారం తగిన రుసుంతో క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. ఈఅవకాశం నవంబరు 30వరకు ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ వంటి విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. మురుగునీరు నిల్వచేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నాయుడుపేట టౌన్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ అన్నారు. శనివారం నాయుడుపేటలో మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది ర్యాలీ నిర్వహించారున అనంతరం మానవ హారం ఏర్పాటు చేసి వర్షాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మురుగునీరు నిల్వ చేరకుండా చూసుకోవాలన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

సూళ్లూరుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందిరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మురుగు కాలువల్లో ఆయిల్ స్ప్రే చేశారు. వీధులను శుభ్రపరిచి బ్లీచింగ్ వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

వాకాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వాకాడులో జరుగుతున్న పారిశుధ్య పనులను శనివారం డీడీవో వాణిరెడ్డి పరిశీలించారు. మండలంలోని బీసీ కాలనీ వద్ద మరుగుకాలువల్లో పేరుకుపోయిన చెత్తను సేకరిస్తుండటంతో స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో నసీంఆలీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమంగళి, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.